ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
CELEBRATING 11TH YEAR ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 9 సంచిక : 54 పేజీలు :12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 31 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :9 ISSUE : 54 PAGES :12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 31 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur





# మొంథా తుఫాన్‌పై విజయం..

## తుఫాన్ సహాయక చర్యల్లో ప్రతిబింబించిన సీబీఎన్ మార్క్

- ఆర్టీజీ సెంటర్ నుంచి రియల్ టైమ్‌లో పర్యవేక్షణ, పరిష్కారం
- ఫైవ్ పాయింట్ ఫార్ములాతో పని చేసిన టీమ్ ఆంధ్రప్రదేశ్
- మానిటర్, అలెర్ట్, రెస్క్యూ, రిహాబిలిటేషన్, నార్మల్సీ వంటి అంశాలపై ఫోకస్
- రక్షణ-సహాయక చర్యల్లో పూర్తి స్థాయిలో టెక్నాలజీ వినియోగం
- ఐదు రోజుల పాటు రాత్రి పగలు పనిచేసిన అధికార యంత్రాంగం
- ప్రభుత్వ ముందస్తు చర్యలతో తగ్గిన ఆస్తి, ప్రాణ నష్టం
- క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల్ని పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:మానిటర్, అలెర్ట్, రెస్క్యూ, రిహాబిలిటేషన్, నార్మల్సీ. మొంథా తుఫాను విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని బృందం అమలు చేసిన పంచసూత్ర ప్రణాళిక ఇదే. తుఫాను హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి నిరంతరం పర్యవేక్షించడం, ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేయడం, నీట మునిగిన ప్రాంతాల్లో ఉన్న వారిని ఆదుకోవడం, వారికి పునరావాసం కల్పించడం, తుఫాను తగ్గాక సాధారణ పరిస్థితులు తీసుకురావడం వంటి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని బృందం పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. దీనికి పూర్తిస్థాయి సాంకేతికతను జోడించడం, క్షేత్రస్థాయిలో మంత్రులు, అధికారులు, ఉద్యోగులతో కూడిన బృందాలతో సమర్థవంతంగా పని చేయించడంతో మొంథా తుఫాను వల్ల కలిగే నష్టాన్ని చాలా వరకు నివారించగలిగారు. ప్రకృతి విపత్తును నివారించే అవకాశం లేదు కాబట్టి నష్టాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవాలనే లక్ష్యంతో టీమ్ ఆంధ్రప్రదేశ్ పని చేసింది. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించుకునే దిశగా ఐదు రోజుల పాటు రాత్రింబవళ్లు అధికార యంత్రాంగం పనిచేసింది. ఇదే ఇప్పుడు సత్ఫలితాలను ఇచ్చింది. మొంథా తుఫాన్ ప్రభావం రాష్ట్రం మీద ఎక్కువగా ఉంటుందనే వాతావరణ హెచ్చరిక రాగానే సీఎం చంద్రబాబు అప్రమత్తమయ్యారు. తుఫాన్ కదలికలను నిరంతరం సమీక్షించడం, ఏయే ప్రాంతాల్లో ఎక్కువ తుఫాన్ ప్రభావం ఉండొచ్చనే విషయాలను తెలుసుకోవడం, ఆ దిశగా క్షేత్రస్థాయిలో ఉన్న వారిని అప్రమత్తం చేస్తూ మొంథా తుఫాన్ తీరాన్ని తాకినా ప్రజల జీవితాలను తాకకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంది ప్రభుత్వం. కొద్దిపాటి ప్రభావం ఉంటుందనుకున్న ప్రాంతాల్లోని వారిని కూడా పునరావాస శిబిరాలకు తరలించారు. లక్ష మందికి పైగా ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించి అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. క్షేత్ర స్థాయి నుంచి రియల్ టైంలో సమాచారాన్ని తీసుకోవడం, దాన్ని విశ్లేషించడం, వాటిని ఆయా విభాగాల బాధ్యులకు చేరవేసి, సమస్యను పరిష్కరించేలా చూడడం వంటి ప్రక్రియను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని బృందం సమర్థవంతంగా అమలు చేసింది. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులకు భరోసా ఇచ్చారు.

**అనుభవానికి సాంకేతికత తోడు**

ఇక ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేలా ప్రభుత్వం

వివరాలు 2లో..

## అధికారుల తీరు అద్భుతం..

### బోటును ఒడ్డుకు చేర్చడంతో సంగం బ్యారేజీకి పెను ముప్పు తప్పింది



- 35 టన్నుల భారీ బోటును ఒడ్డుకు చేర్చడంలో అధికారుల తీరు ప్రశంసనీయమన్న అనిత
- బ్యారేజీకి ప్రమాదం సంభవించకుండా కలెక్టర్ సహా అధికారులు, సిబ్బంది పని చేశారని కితాబు
- సంగం బ్యారేజీ బోటు ప్రమాదానికి గురి కాకుండా చర్యలు తీసుకున్నారన్న అనిత

పెన్ పవర్ డెస్క్:అధికారుల ముందస్తు చర్యలతో నెల్లూరులోని సంగం బ్యారేజీకి ముప్పు తప్పిందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మొంథా తుఫాను నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

వివరాలు 2లో..

## సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్



- ప్రస్తుత సీజేఐ జస్టిస్ గవాయ్ సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- 2025 నవంబర్ 24న బాధ్యతలు స్వీకరించనున్న కొత్త సీజేఐ
- సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా పదవి చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్
- దాదాపు 14 నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్న జస్టిస్ సూర్యకాంత్

వివరాలు 2లో..



## కోడూరులో పంటపొలాలను పరిశీలించిన పవన్ కల్యాణ్..

పెన్ పవర్ డెస్క్:మొంథా తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు, వరదలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంటపొలాలు దెబ్బతిన్నాయి. కోతకు వచ్చిన వరి పొలాలు నీటిపాలయ్యాయి. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం కోడూరులో పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటపొలాలను స్వయంగా పరిశీలించారు. పంటపొలాల్లోకి దిగి వరి పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పంట నష్టంపై వివరాలు వారిని అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ వారికి హామీ ఇచ్చారు.

## సర్దార్ పటేల్‌కు భారతరత్న ఇవ్వడానికి 41 ఏళ్లు పట్టింది

### కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్

- సర్దార్ పటేల్ వారసత్వాన్ని కాంగ్రెస్ గౌరవించలేదని అమిత్ షా ఆరోపణ
- ఆయన మరణించాక భారతరత్న ఇవ్వడానికి కాంగ్రెస్ కు 41 ఏళ్లు పట్టిందని విమర్శ
- మోదీ ప్రధాని అయ్యాకే పటేల్‌కు సముచిత గౌరవం దక్కిందన్న హోంమంత్రి
- పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా భారీ కార్యక్రమాలకు పిలుపు
- ప్రతి ఏటా అక్టోబర్ 31న భారీ పరేడ్ నిర్వహిస్తామని ప్రకటన

వివరాలు 2లో..





## భారత్‌లో పెళ్లిళ్ల సీజన్..

### 45 రోజుల్లో రూ.6.5 లక్షల కోట్ల వ్యాపారం!

- నవంబర్ 1 నుంచి 45 రోజుల పెళ్లిళ్ల సీజన్
- దేశవ్యాప్తంగా 46 లక్షల వివాహాలతో రూ.6.5 లక్షల కోట్ల వ్యాపారం అంచనా
- వెడ్డింగ్ కొనుగోళ్లలో 70 శాతానికి పైగా స్వదేశీ ఉత్పత్తులకే మొగ్గు
- ఈ సీజన్‌లో కోటికి పైగా తాత్కాలిక ఉద్యోగాలు లభించే అవకాశం
- ఒక్క ఢిల్లీ నుంచే రూ.1.8 లక్షల కోట్ల వ్యాపారం అంచనా
- ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.75,000 కోట్ల ఆదాయం అంచనా

పెన్ పవర్ డెస్క్:దేశంలో పెళ్లిళ్ల సీజన్ మరోసారి ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతాన్ని ఇవ్వనుంది. నవంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే 45 రోజుల వివాహ సీజన్‌లో దేశవ్యాప్తంగా సుమారు 46 లక్షల పెళ్లిళ్లు జరగనున్నాయని, దీని ద్వారా ఏకంగా రూ.6.5 లక్షల కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని

వివరాలు 2లో..

## యువతకు ఉద్యోగాల గేట్‌వేగా 'నైపుణ్యం' పోర్టల్, ప్రతి నెల జాబ్ మేళాలు



- నైపుణ్యాభివృద్ధితో పాటు ఉన్నత విద్యకు సహకారం
- శిక్షణ పూర్తయితే స్కిల్ టెస్టింగ్, ధృవపత్రాల జారీ
- ఆర్టీఐహెచ్‌తో విద్యార్థుల ఆవిష్కరణల అనుసంధానం
- నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే, వారి ఉన్నత విద్యకు ప్రభుత్వం సహకరిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారి కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్‌వేగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029 నాటికి 20 లక్షలు

వివరాలు 2లో..

## పంట నష్టపోయిన రైతులకు హెక్టార్‌కు రూ. 25 వేల పరిహారం



- మొంథా తుఫాన్ నష్టంపై రేపల్లెలో మంత్రి అనగాని సమీక్ష
- తుఫాన్ నష్టాన్ని తగ్గించడం చారిత్రాత్మకమని వెల్లడి
- విపత్తు సమయంలో వైసీపీ నేతలు కనిపించలేదని విమర్శ

పెన్ పవర్ డెస్క్:మొంథా తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, హెక్టార్‌కు రూ. 25 వేల వరకు పరిహారం అందించే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేపల్లెలోని మున్సిపల్ కార్యాలయంలో తుఫాన్ వరద ప్రభావంపై అధికారులతో

వివరాలు 2లో..

## మున్నేరు ఉగ్రరూపం.. నిలిచిన వాహనాల రాకపోకలు..

- పెనుగంచిప్రోలు వద్ద కాజ్ వే పైనుంచి ప్రవహిస్తున్న నది
- నీట మునిగిన బ్రిడ్జి.. వాహనాలను ఆపేసిన అధికారులు
- పెనుగంచిప్రోలు గ్రామ వాసులను అప్రమత్తం చేసిన రెవెన్యూ సిబ్బంది



పెన్ పవర్ డెస్క్:భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరదతో మున్నేరు నది ఉగ్రరూపం దాల్చింది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. వరదనీరు బ్రిడ్జిని ముంచెత్తింది. బ్రిడ్జి పైనుంచి వరద ప్రవహిస్తుండడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. వాహనాల రాకపోకలు నిలిపివేశారు.

వివరాలు 2లో..

## తుపాన్ సాయంపై రాజకీయ దుమారం..

### అప్పటికి ఇప్పటికి తేడా ఇదేనంటూ వైసీపీ ఎమ్మెల్యే ట్వీట్




- మొంథా తుపాన్ బాధితులకు ప్రభుత్వ సాయంపై విమర్శలు
- కూటమి ప్రభుత్వంపై యర్రగొండపాలెం ఎమ్మెల్యే అసంతృప్తి
- జగన్ హయాంతో పోలుస్తూ తాటిపర్తి చంద్రశేఖర్ ట్వీట్
- ప్రస్తుత సాయం చాలా తక్కువంటూ ఆరోపణ
- ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని వివరించిన పవన్ కల్యాణ్
- నిత్యావసరాలతో పాటు కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సాయం

వివరాలు 2లో..

## బీహార్‌లో వేడెక్కిన రాజకీయం..

### నిన్న మోదీ ప్రచారం, మొన్న రాహుల్ విమర్శలు

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ
- ముజఫర్‌పూర్, ఛప్రాలో రెండు బహిరంగ సభలు
- ఎన్డీఏ కూటమిదే ఘన విజయమని ధీమా
- ఓట్ల కోసం మోదీ ఏ డ్రామా అయినా ఆడతారన్న రాహుల్ గాంధీ
- మహారాష్ట్ర, హర్యానా లాగే బీహార్‌లో ఓట్లు దొంగిలిస్తారని ఆరోపణ
- నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనున్న పోలింగ్

వివరాలు 2లో..



# అధికారుల తీరు అద్భుతం.. బోటును ఒడ్డుకు చేర్చడంతో సంగం బ్యారేజీకి పెను ముప్పు తప్పింది

- మొదటి పేజి తరువాయి

కురిసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ, సంగం బ్యారేజీకి కొట్టుకువచ్చిన 35 టన్నుల భారీ బోటును ఒడ్డుకు చేర్చడంలో అధికారుల చూపిన చొరవ అభినందనీయమని ఆమె అన్నారు.సకాలంలో స్పందించి బోటు కారణంగా బ్యారేజీకి ప్రమాదం సంభవించకుండా కలెక్టర్, జిల్లా అధికారులు వెంటనే స్పందించారని ఆమె కొనియాడారు. తద్వారా సంగం బ్యారేజీ ప్రమాదానికి గురికాకుండా చర్యలు తీసుకున్నారని వంగలపూడి అనిత తెలిపారు.

**ఏం జరిగిందంటే?**

సంగం బ్యారేజీ వద్ద జరిగిన ఘటన అందరినీ ఆందోళనకు గురి చేసింది. నదిలో లక్ష క్యూసెక్కుల వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో, 30 టన్నుల బరువున్న ఇసుక బోటు లంగరు తెగిపోయి నేరుగా బ్యారేజీ గేట్ల దిశగా దూసుకొచ్చింది. ఒకవేళ ఆ భారీ బోటు వరద ఉధ్రుతికి బ్యారేజీని ఢీకొంటే, 85 గేట్లతో నిర్మితమైన సంగం బ్యారేజీ ఉనికి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉండేది. లక్షలాది ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఈ ప్రాజెక్టుకు నష్టం వాటిల్లితే పరిస్థితి ఊహించలేనంత తీవ్రంగా ఉండేది. ఈ విషయం తెలియగానే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ డా. అజిత వజ్రేంద్ర వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.30 మంది ఎన్డీఆర్ఎఫ్, 30 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 100 మంది పోలీస్, భద్రతా దళ సిబ్బంది, కృష్ణపట్నం పోర్టు గస్తీ బృందం, ఫైర్, ఇరిగేషన్ అధికారుల బృందం సమన్వయంతో పనిచేసి భారీ ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. తాళ్ల సహాయంతో బోటును ఒడ్డుకు చేర్చారు.

## ఎడిటర్ వ్యూ

### సర్దార్ పటేల్‌కు భారతరత్న ఇవ్వడానికి 41 ఏళ్లు పట్టింది

భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వారసత్వాన్ని గౌరవించడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విమర్శించారు. పటేల్ మరణించిన 41 సంవత్సరాల తర్వాత ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. సర్దార్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు."సర్దార్ పటేల్ మరణానంతరం ఆయన వారసత్వాన్ని చెరిపివేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. ఆయనకు భారతరత్న ఇవ్వడానికి 41 ఏళ్ల సమయం పట్టింది. కానీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అతిపెద్దదైన 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' నిర్మించి పటేల్‌కు అసలైన గౌరవాన్ని అందించారు" అని అమిత్ షా అన్నారు.

సర్దార్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల గురించి తెలియజేయడానికే తాను ఇక్కడికి వచ్చానని షా తెలిపారు. "భారతదేశ స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని ఏకీకృతం చేయడంలో, ఏక్ భారత్ నిర్మాణంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర పోషించారు. రేపు ఆయన 150వ జయంతి. 2014 నుంచి ప్రధాని మోదీ ప్రతి ఏటా కేవడియాకు వచ్చి ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు" అని పేర్కొన్నారు.ఈ ఏడాది నుంచి పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31న ప్రతి సంవత్సరం భారీ పరేడ్ నిర్వహించాలని హోం మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్లు అమిత్ షా ప్రకటించారు. "ఈ సంవత్సరం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లాలు, పోలీస్ స్టేషన్ల స్థాయిలో 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తాం" అని వివరించారు. దీంతో పాటు నవంబర్ 1 నుంచి 15 వరకు ఏక్తా నగర్‌లో 'ఏక్ భారత్ పర్వ్' కార్యక్రమం ఉంటుందని, గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతినాడు అది ముగుస్తుందని తెలిపారు."సర్దార్ పటేల్ కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక సిద్ధాంతం. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. మహాత్మాగాంధీ నేతృత్వంలోని ఎన్నో ఉద్యమాలకు వెన్నెముకగా నిలిచారు. అందుకే గాంధీజీ ఆయనకు ప్రేమతో 'సర్దార్' అనే బిరుదు ఇచ్చారు" అని అమిత్ షా అన్నారు.

దేశ సమగ్రత విషయంలో పటేల్ తీసుకున్న నిర్ణయాత్మక పాత్రను గుర్తుచేస్తూ, "ఆగస్టు 15న దేశమంతా స్వాతంత్ర్య వేడుకల్లో ఉన్నప్పుడు, సర్దార్ పటేల్ కమాండ్ రూమ్‌లో ఉండి లక్షద్వీప్‌ను కాపాడేందుకు నావికాదళ అధికారులతో ఆపరేషన్లను పర్యవేక్షిస్తున్నారు. ఆయన నాయకత్వ పటిమ వల్లే ఆ దీవులు భారత్‌లో అంతర్భాగమయ్యాయి" అని అమిత్ షా వివరించారు.

## యువతకు ఉద్యోగాల గేట్‌వేగా 'నైపుణ్యం' పోర్టల్, ప్రతి నెల జాబ్ మేళాలు

- మొదటి పేజి తరువాయి

ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు.ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా 'నైపుణ్యం' పోర్టల్‌ను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేయాలని అన్నారు.గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. నైపుణ్యం పోర్టల్, జాబ్ డ్యాష్ బోర్డ్, వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి సమీక్షలో చర్చించారు.

**క్లస్టర్ల ఆధారంగా నైపుణ్య శిక్షణ : లోకేశ్**

క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని, స్పేస్, ఆక్వా, క్వాంటం లాంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి లోకేశ్ ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరులను అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేసి అమలు చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా నైపుణ్య పోర్టల్ అభివృద్ధి చేయడమే కాకుండా నైపుణ్య కల్పనలో దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదించాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు.

విశ్వవిద్యాలయాలు, జాతీయ-అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందకుండా నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా 'నైపుణ్యం' పోర్టల్‌ను తీర్చిదిద్దాలన్నారు. అభ్యర్థులు ఏ రంగంలో తమకు ఉద్యోగం, ఉపాధి కావాలో ఆ అవకాశాన్ని పొందేలే వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు.

**అన్ని శాఖలు, విభాగాల డేటా అనుసంధానం**

ఇప్పటివరకు రాష్ట్రంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,44,000 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నైపుణ్యం పోర్టల్ నుంచి ఏఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను రూపొందించుకునే వెసులుబాటు కల్పించినట్టు వెల్లడించారు. వాట్సప్ ద్వారా ఉద్యోగావకాశాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అన్ని శాఖలు, విభాగాల డేటా బేస్‌ను సమీకృతం చేసి నిజమైన నిరుద్యోగులను గుర్తిస్తున్నామని అధికారులు వివరించారు.ఎక్కడ, ఏ రంగంలో శిక్షణ అందిస్తున్నాం, జాబ్ మేళాలు ఏ ప్రాంతంలో నిర్వహిస్తున్నాం, ఏయే సంస్థల్లో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే దానిపై పోర్టల్ నుంచి అభ్యర్థులకు సమాచారం అందేలా తీర్చిదిద్దామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యేలా ఏఐ సిమ్యులేటర్ సైతం నైపుణ్యం పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు.

## మున్నేరు ఉగ్రరూపం.. నిలిచిన వాహనాల రాకపోకలు..

- మొదటి పేజి తరువాయి

వరద ఉధృతికి పెనుగంచిప్రోలు పరిసర ప్రాంతాల్లో పలు ఆలయాలు నీట మునిగాయి. గత రాత్రి నుండి ఇప్పటివరకు 15 అడుగులకు పైగా వరద నీరు పెరగడంతో పెనుగంచిప్రోలు గ్రామ వాసులను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. లోతట్టు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

## మండలంలో భారీ వర్షం ఉప్పొంగిన కొండవాగులు

**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 30:**తుఫాన్ నేపథ్యంలో మండలంలో గురువారం తెల్లవారుజాము నుండి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి రెండు గంటల సమయం నుండి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో మండలంలోని కొండవాగులు ఉధృతంగా ప్రవహించాయి. మండలంలోని కన్నేరు, పెద్దేరు జువ్వమ్మ కాలువ పెద్ద కాలువ ఉధృతంగా ప్రవహించి ప్రజలను భయాందోళనలకు గురి చేశాయి. అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి నెల్లిపూడి గ్రామ శివారులో గల కొండ






కాలువ ఉధృతంగా ప్రవహించి కల్వర్టు పై నుండి ప్రవాహం కొనసాగింది. దీంతో గోకవరం అడ్డతీగల ప్రధాన రహదారిలో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు ఉధృతిని తాసిల్దార్ శ్రీనివాసరావు ఎస్సై వెంకటేష్ పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టారు. కల్వర్టు పై నుండి ఎవరిని రాకుండా సిబ్బందిని ఏర్పాటు చేసి స్వయంగా పర్యవేక్షించారు. అలాగే సూరంపాలెం రిజర్వాయర్ లోకి వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యమైన 105 మీటర్లు దాటిపోవడంతో ప్రాజెక్టులోని రెండు గేట్ల అదనపు నీటిని బురద కాలువ పైకి వదిలేశారు.

## సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ భూషణ్ ఆర్. గవాయ్ సిఫార్సు మేరకు ఈ నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2025 నవంబర్ 24వ తేదీ నుంచి జస్టిస్ సూర్యకాంత్ నియామకం అమల్లోకి వస్తుందని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ గవాయ్ 2025 నవంబర్ 23న 65 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేయనున్నారు. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిని తదుపరి సీజేఐగా నియమించే సంప్రదాయం ప్రకారం, జస్టిస్ గవాయ్ తన తర్వాత జస్టిస్ సూర్యకాంత్ పేరును సిఫార్సు చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (2) ప్రకారం రాష్ట్రపతి ఈ నియామకాన్ని ఆమోదించినట్టు కేంద్ర న్యాయ శాఖ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది.జస్టిస్ సూర్యకాంత్ భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారు. ఆయన దాదాపు 14 నెలల పాటు ఈ పదవిలో కొనసాగి, 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేస్తారు.

**జస్టిస్ సూర్యకాంత్ నేపథ్యం**

జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హర్యానాలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. హిసార్‌లోని ప్రభుత్వ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయం నుంచి 1984లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అదే ఏడాది హిసార్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించి, మరుసటి ఏడాది చండీగఢ్‌కు మారి పంజాబ్, హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. ఆయన అతి పిన్న వయసులోనే 2000 జులై 7న హర్యానా అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు.2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆ తర్వాత 2018 అక్టోబర్ 5న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. అక్కడి నుంచి 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జాతీయ న్యాయ సేవల అథారిటీ లో సభ్యుడిగా సేవలందించిన ఆయన, ప్రస్తుతం సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.

## సమర్థ పాలనతో...మొంథా తుఫాన్‌పై విజయం..

- మొదటి పేజి తరువాయి

ఈ విపత్తు కాలంలో పని చేసింది. శిశువుల నుంచి వృద్ధుల వరకు, అలాగే గర్భిణులను కూడా సంరక్షణ కేంద్రానికి తరలించింది. పశువుల ప్రాణాలను కూడా కాపాడేందుకు యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సమాయత్తం చేశారు. దీనికి టెక్నాలజీని జోడించారు. దీంట్లో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు వరుసగా 1.1 కోట్ల సందేశాలు పంపారు. అలాగే సాంకేతికతను జోడించి గ్రామాల్లో మైక్ ద్వారా అనౌన్సుమెంట్ చేసే విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఆర్టీజీ సెంటర్ నుంచే సెల్‌ఫోన్ ద్వారా ఆ మైక్ అనౌన్సుమెంటును ఆపరేట్ చేసే విధానాన్ని రూపొందించడమే కాకుండా.. ఒకవేళ సెల్‌ఫోన్ సిగ్నల్ లేకపోతే శాటిలైట్ ద్వారా ఆ వ్యవస్థ పని చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇలాంటి చర్యల వల్ల గతంతో పోల్చితే ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను పునరావాస శిబిరాలకు తీసుకురావడం సులువైంది. సహజంగా లంక గ్రామాల ప్రజలు తమ ఇళ్లను వదిలి రావడానికి ఇష్టపడరు.తుఫాన్లు వచ్చినా ఇళ్ల పైకప్పులపైకి ఎక్కుతారు. కానీ ప్రభుత్వం ముందుగానే అలెర్ట్ చేయడంతోపాటు క్షేత్ర స్థాయి సిబ్బంది కూడా ఇంటింటికీ వెళ్లి వారికి నచ్చజెప్పి తుఫాన్ షెల్టర్లకు తీసుకొచ్చింది. దీంతో ప్రాణ నష్టానికి స్థానం లేకుండా చేయగలిగారు. ఇక టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని మరోసారి రుజువైంది. బాపట్ల జిల్లా పర్చూరు వాగులో కొట్టుకుపోతున్న షేక్ మున్నా అనే వ్యక్తిని డ్రోన్ల ద్వారా గుర్తించి పోలీసులు, అధికారుల బృందం అతణ్ని రక్షించింది.అలాగే ప్రభుత్వం వద్ద ఉన్న అలెర్ట్ మెకానిజం ద్వారా త్వరగా స్పందించడం వల్లే బాపట్ల జిల్లాలోనే ఒక ప్రార్థనా మందిరానికి వెళ్లి చిక్కుకుపోయిన 15 మందిని రెస్క్యూ ఆపరేషన్ చేసి కాపాడారు. ఈ విషయంలో ఏ మాత్రం అలక్ష్యం వహించినా వారి ప్రాణాలు దక్కేవి కాదు. ఇక గర్భిణులు, దివ్యాంగుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. టెక్నాలజీతో పాటు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా హ్యాండిల్ చేయాలనే అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకున్న అనుభవం బాగా కలిసి వచ్చింది.

**లైవ్ ట్రాకింగ్, రియల్ టైం సొల్యూషన్స్**

ఇక పంటలకు నష్టం వాటిల్లకుండా కూడా ప్రభుత్వం వీలైనంత మేరకు జాగ్రత్తలు తీసుకుంది. తుఫాను హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి కాల్వల్లో గుర్రపు డెక్క తొలగించే అంశాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ విధంగా చేయడం ద్వారా వీలైనంత మేర పంట నష్టం తగ్గించే ప్రయత్నం చేసింది ప్రభుత్వం. ఇక డ్రైనేజీలు కూడా క్లీనప్ చేయడంతో నగరాల్లో కూడా నీటి నిల్వ లేకుండా చూడడంలో అధికార యంత్రాంగం సక్సెస్ అయింది. ఇక తుఫాన్ గాలులకు చెట్లు పడిపోయినా, విద్యుత్ స్థంభాలు పడిపోయినా, వైర్లు తెగిపడినా వాటి కారణంగా ట్రాఫిక్ జామ్ కాకుండా, ప్రమాదాలు జరగకుండా వెంటనే వాటిని తొలగించడంతోపాటు విద్యుత్ వ్యవస్థను అతి తక్కువ సమయంలోనే పునరుద్ధరించారు. దీనికోసం అవసరమైన సామాగ్రి, వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకున్నారు.

వేలకొద్ది యంత్రాలను, వాహనాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకున్నారు. ఇక సహాయక చర్యల నిమిత్తం జేసీబీలను కూడా భారీ ఎత్తున సిద్ధం చేసుకుంది. వాటికి లైవ్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అవసరమైన మేరకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగింది. గతంలో వర్షాలు వచ్చినా, వరదలు వచ్చినా బోట్లు కొట్టుకురావడం, బ్యారేజీల గేట్లకు బలంగా తాకడం వంటివి జరిగేవి. కానీ ఈసారి అలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంట్లో భాగంగానే నెల్లూరు జిల్లా కలెక్టర్ తనకు అందిన సమాచారంతో అప్రమత్తం కావడంతో భారీ బోటును చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. లేకుంటే సంగం బ్యారేజీకి ఆ బోట్లు ఢీ కొట్టి ప్రమాదం ఏర్పడేది. ఇవన్నీ ముందు జాగ్రత్తలు తీసుకోవడం, అలెర్ట్ మెకానిజం ఉండడం వల్ల తప్పిన ప్రమాదాలే. ఇక కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా నిరంతరం పర్యవేక్షించడంతోపాటు గండ్లు పడితే వాటిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చేందుకు అవసరమైన ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. అలాగే రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీ సెంటర్ ద్వారా వచ్చిన ఆదేశాలు గ్రామ సచివాలయ స్థాయిలో వెంటనే అమలు చేయగలిగేలా విజయవంతంగా ప్రభుత్వం పని చేసింది.

**త్వరితగతిన నష్టపరిహారం**

పునరావాస శిబిరాలను ముందుగానే సిద్ధం చేశారు. ఎప్పుడు అవసరమైతే అప్పుడు సహాయ శిబిరాలను హడావుడిగా ఏర్పాటు చేసుకునే పరిస్థితికి స్వస్తి చెప్పాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వాతావరణ హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి పునరావాస శిబిరాలను సిద్ధం చేసుకోవాలని చెప్పడమే కాకుండా వాటిని అమల్లో పెట్టేలా చేశారు ముఖ్యమంత్రి. బాధితులకు ఆహారం, వసతి కల్పించడంతోపాటు కావాల్సిన మందులను కూడా పునరావాసంలో అందుబాటులో ఉంచారు. ఇలాంటి ఏర్పాట్లను సిద్ధం చేయడంతోపాటు పునరావాస కేంద్రాల్లోని పరిస్థితులను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.అలాగే వైద్య బృందాలను సిద్ధం చేశారు. బాధితులకు అందించే నిత్యావసర వస్తువులను, ఆర్థిక సాయాన్ని కూడా ముందుగానే ప్రభుత్వం సిద్ధం చేసుకుంది. ఇక పునరావాస శిబిరాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు తుఫాన్ వెలిశాక ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకురావడానికి కూడా ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇక పంట నష్టం అంచనాలను కూడా త్వరితగతిన వేసి కేంద్రానికి వీలైనంత త్వరగా నివేదికలు సమర్పించే వరకు పూర్తి స్థాయిలో ముందస్తు ప్రణాళికలతో ప్రభుత్వం వ్యవహరించింది.

## తుపాన్ సాయంపై రాజకీయ దుమారం..

మొంథా తుపాన్ ఏపీని అతలాకుతలం చేస్తున్న వేళ, ప్రభుత్వం ప్రకటించిన సహాయక చర్యలపై రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న సాయం చాలా తక్కువగా ఉందంటూ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా రెండు ప్రభుత్వాల హయాంలో అందించిన సాయాన్ని పోలుస్తూ ఓ పోస్ట్ పెట్టారు."వరదల సమయంలో వైఎస్ జగన్ సీఎంగా ఉంటే రూ.2,000%-%రూ.3,000 నగదుతో పాటు రేషన్ కిట్, ఇంటి నష్టం: రూ.10,000%-% రూ.1,20,000, పంట నష్టం: రూ.5,000%-%రూ.10,000(ఎకరానికి), మనిషి చనిపోతే రూ. 5,00,000 సహాయం ఇంటి తలుపువద్దకే వచ్చేది. కానీ, ఇప్పుడు చంద్రబాబు ఉన్నందున ఒక్కరికి రూ.1,000, కుటుంబానికి రూ.3,000 ఇస్తున్నారని" ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, కూటమి ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం.. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించిన కుటుంబాలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. కుటుంబంలో ఒక్కరే ఉంటే రూ.1,000 ఇవ్వాలని ఆదేశించారు. బాధితులు తమ ఇళ్లకు తిరిగి వెళ్లే సమయంలో ఈ మొత్తాన్ని అందజేయాలని కలెక్టర్లకు సూచించారు. దీంతో పాటు నిత్యావసర సరుకుల పంపిణీకి కూడా భారీ ఏర్పాట్లు చేశారు.ప్రభుత్వ సహాయక చర్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరణ ఇచ్చారు. ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యం, పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకుల కిట్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కిట్‌లో కందిపప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార వంటివి ఉంటాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 14,415 రేషన్ షాపుల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని, మంత్రులు అనిత, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## భారత్‌లో పెళ్లిళ్ల సీజన్.. 45 రోజుల్లో రూ.6.5 లక్షల కోట్ల వ్యాపారం!

- మొదటి పేజి తరువాయి

ఒక నివేదిక అంచనా వేసింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ పరిశోధన విభాగమైన సీఆర్‌టీడీఎస్ గురువారం ఈ నివేదికను విడుదల చేసింది.దేశంలోని 75 నగరాల్లో నిర్వహించిన సర్వే ఆధారంగా ఈ వివరాలను వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే పెళ్లిళ్ల సంఖ్యలో పెద్దగా మార్పు లేనప్పటికీ, ఒక్కో వివాహానికి చేసే ఖర్చు గణనీయంగా పెరిగిందని నివేదిక పేర్కొంది. ఒక్క దేశ రాజధాని ఢిల్లీలోనే 4.8 లక్షల వివాహాల ద్వారా రూ.1.8 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేశారు. గత పండుగ సీజన్‌లో రికార్డు స్థాయిలో జరిగిన అమ్మకాల తర్వాత వినియోగదారుల్లో పెరిగిన విశ్వాసం, ప్రజల వద్ద పెరిగిన ద్రవ్య లభ్యత, బంగారం వంటి విలువైన లోహాల ధరలు పెరగడం వంటి కారణాలతో ఈసారి వ్యాపారం భారీగా పెరిగిందని %జూ×ు% సెక్రటరీ జనరల్, చాందినీ చౌక్ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. గతేడాది (2024లో) 48 లక్షల వివాహాల ద్వారా రూ.5.90 లక్షల కోట్ల వ్యాపారం జరగ్గా, 2023లో 38 లక్షల వివాహాలకు రూ.4.74 లక్షల కోట్లు ఖర్చు చేశారు.

**స్వదేశీ ఉత్పత్తులకే పెద్దపీట**

ఈసారి పెళ్లిళ్లలో స్వదేశీ ఉత్పత్తుల వాడకం గణనీయంగా పెరగడం ఒక ముఖ్యమైన పరిణామం. పెళ్లికి సంబంధించిన కొనుగోళ్లలో 70 శాతానికి పైగా దుస్తులు, ఆభరణాలు, అలంకరణ వస్తువులు, పాత్రలు వంటివి భారతీయ తయారీవే ఉంటున్నాయని నివేదిక హైలైట్ చేసింది. %జూ×ు% చేపట్టిన "వోకల్ ఫర్ లోకల్ వెడ్డింగ్స్" ప్రచారం మంచి ఫలితాలనిస్తోందని, దీనివల్ల చైనా లైట్లు, కృత్రిమ అలంకరణ వస్తువుల వంటి దిగుమతులు బాగా తగ్గాయని పేర్కొంది.ఈ వివాహ సీజన్ ద్వారా సుమారు కోటికి పైగా తాత్కాలిక, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు సృష్టించబడతాయని ఖండేల్వాల్ తెలిపారు. డెకరేటర్లు, క్యాటరింగ్ సిబ్బంది, పూల వ్యాపారులు, కళాకారులు, రవాణా, హాస్పిటాలిటీ రంగాల వారికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుంది. అలాగే, టెక్స్‌టైల్స్, ఆభరణాలు, హస్తకళలు, ప్యాకేజింగ్ వంటి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (%మీఎవీజుం%) ఇది పెద్ద ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఈ సీజన్‌లో ప్రభుత్వానికి పన్నుల రూపంలో సుమారు రూ.75,000 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. మొత్తం వ్యాపారంలో ఆభరణాల వాటా 15% ఉండగా, దుస్తులు, చీరల వాటా 10%గా ఉంటుందని తెలిపింది.

## పంట నష్టపోయిన రైతులకు హెక్టార్‌కు రూ. 25 వేల పరిహారం

- మొదటి పేజి తరువాయి

ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పంట నష్టానికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారని వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎదురైన మొంథా తుపాను ప్రభావాన్ని తగ్గించడానికి చేసిన కృషి ఒక చరిత్ర. గత ఆరు రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ మైక్రో లెవల్‌లో పరిస్థితిని పర్యవేక్షించారు. వారి కృషితోనే ప్రాణ, ఆస్తి నష్టాన్ని పెద్ద ఎత్తున నివారించగలిగాం. అనివార్య కారణాలతో ఇద్దరు మరణించడం బాధాకరం" అని అన్నారు.తుపాను సహాయక చర్యల్లో కూటమి పార్టీల నేతలు బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పాల్గొన్నారని, అయితే విపత్తు సమయంలో వైసీపీ నేతలు ఎక్కడా కనిపించలేదని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తుపాను ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి బాధితులను పరామర్శించారని, కానీ గత ముఖ్యమంత్రి మాత్రం ఓ స్టేజీ ఏర్పాటు చేసి బాధితులను తన వద్దకే రప్పించుకున్నారని విమర్శించారు.తుపాను వల్ల ఇళ్లు దెబ్బతిన్న వారిని, మత్స్యకారులను కూడా ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. మత్స్యకారులకు అదనపు సహాయం అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న సహాయం పట్ల ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## బీహార్‌లో వేడెక్కిన రాజకీయం..

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రధాన పార్టీల అగ్రనేతల పర్యటనలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ నేడు ముజఫర్‌పూర్, ఛప్రాలలో రెండు ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ద్వారా ఎన్డీఏ కూటమి ప్రచారాన్ని మరింత ఉద్ధృతం చేయనున్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ బీహార్‌లో బీజేపీ-ఎన్డీఏ కూటమి సంపూర్ణ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "బీహార్‌లోని నా కుటుంబ సభ్యులే ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం కోసం స్వయంగా బరిలోకి దిగారు. ఈ ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ ఉదయం 11 గంటలకు ముజఫర్‌పూర్‌లో, మధ్యాహ్నం 12:45 గంటలకు ఛప్రాలో ప్రజలతో సంభాషించే భాగ్యం నాకు కలుగుతుంది. రాష్ట్రంలోని నా సోదర సోదరీమణులు మరోసారి విజయ శంఖాన్ని పూరిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆయన పేర్కొన్నారు.మరోవైపు, కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ముజఫర్‌పూర్‌లో జరిగిన మహాఘట్‌బంధన్ ఉమ్మడి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీపై తీవ్ర ఆరోపణలు చేశారు. "ఆయనకు (మోదీకి) కేవలం మీ ఓటు మాత్రమే కావాలి. ఓట్ల కోసం డ్రామా చేయమంటే చేస్తారు. మీరేమైనా చేయించగలరు. నరేంద్ర మోదీని డ్యాన్స్ చేయమన్నా చేస్తారు" అంటూ రాహుల్ విమర్శించారు."వారు మీ ఓట్లను దొంగిలించే పనిలో ఉన్నారు. మహారాష్ట్ర, హర్యానాలలో ఎన్నికలను దొంగిలించారు. ఇప్పుడు బీహార్‌లోనూ అదే ప్రయత్నం చేస్తారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇదిలా ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బుధవారం బేగుసరాయ్, సమస్తిపూర్, దర్భంగాలలో ఎన్డీఏ తరఫున ప్రచార ర్యాలీలు నిర్వహించారు.2025 బీహార్ ఎన్నికల్లో ప్రధాన పోటీ ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ కూటముల మధ్య నెలకొంది. ఎన్డీఏలో బీజేపీ, జేడీ(యూ), ఎల్‌జేపీ (రామ్ విలాస్) వంటి పార్టీలు ఉండగా, మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు ఉన్నాయి. వీటికి తోడు ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ కూడా రాష్ట్రంలోని 243 స్థానాల్లో పోటీ చేస్తోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు



# అధికారుల అనుమతి లేకుండా చెట్లు నరికిన కార్పొరేషన్ సిబ్బంది

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30:**మొక్కలు నాటండి , నగరంలో పర్యావరణాన్ని కాపాడండి అని వేదికలపై చెప్పే కార్పొరేషన్, ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులకు, క్షేత్రస్థాయిలో సిబ్బందికి సమన్వయ లోపం చెట్ల పాలిట శాపంగా మారింది. కార్పొరేషన్, విద్యుత్తు, రోడ్డు భవనాల, పోలీస్ శాఖలకు చెందిన అధికారుల ఆదేశాలు లేకుండానే సంవత్సరాల తరబడి పెరిగిన పెద్ద, పెద్ద చెట్లను, ఇష్ట నుసారం గా క్రింది స్థాయి పారిశుద్ధ్య సిబ్బంది నరికి వేస్తున్నారు. నగర పరిధిలో మాస్టర్ ప్లాన్ అమలు చేసినప్పుడు గాని, లేదా రోడ్ల, డ్రైనులు , విస్తరణ చేపట్టినప్పుడు గాని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పుడు గాని తప్పనిసరి పరిస్థితుల్లో అడ్డువచ్చే కొమ్మలను , చెట్లను తొలగించాల్సి ఉంది. అయితే కార్పొరేషన్ పారిశుద్ధ్య సిబ్బంది ప్రైవేటు గృహాల యజమానులతో, వ్యక్తులతో, కుమ్మక్కయ్యి రోడ్ల మార్జిన్ పక్కన ఇండ్ల ముందు ఉన్న చెట్లను మున్సిపల్ జెసిబి లతో , కటింగ్ యంత్రాలతో తొలగించడం పట్ల పర్యావరణ ప్రియులు, ప్రజలు చెందుతున్నారు. తాజాగా ఎస్ కే వీటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ పక్కన ఐదు సంవత్సరాలుగా పెరిగిన పచ్చని చెట్లను కార్పొరేషన్ సిబ్బంది కార్పొరేషన్ సిబ్బంది జె సీబీలతో తొలగించి చెత్త ట్రాక్టర్లపై తరలించడం స్థానికులను ఆవేదనకు గురి చేసింది. వేసవి కాలంలో మండే ఎండలకు , వానలకు చక్కగా నీడనిచ్చిందని స్థానికులు శివ, దొరబాబు, వెంకటలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు వాపోయారు. ఈ రోడ్లో సంవత్సరాలుగా పెరిగిన చెట్లను కార్పొరేషన్ సిబ్బంది నరికి వేశారని ఆవేదన చెందారు. నగరంలో చాలా చోట్ల మూడు నాలుగు దశాబ్దాలుగా పెరిగిన నిద్ర గన్నేరు, మామిడి, మర్రి ,రావి చెట్లు, గానుగ, నేరేడు బూ రుగ తదితర రకాల చెట్లను కార్పొరేషన్ సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తులతో కలిసి నరికి వేసిన ఘటన లను గుర్తు చేస్తున్నారు. చెట్ల తొలగింపునకు సంబంధించి ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులు ఆదేశాలు లేవని తెలుస్తోంది. ఇటీవల కాలంలో తిలక్ రోడ్డు, జేఎన్ రోడ్డు, ఏవి ఏ రోడ్డు, దానవాపేట, మల్టీ లెవెల్ కాంప్లెక్సు , మల్టీ లెవెల్ వ్యాపార, వస్త్ర దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, పెద్ద ,పెద్ద కార్పొరేట్ హాస్పిటల్స్, విద్యాలయాలు, విస్తృతంగా పెరిగాయి. దాంతో ఇండ్లు, వాణిజ్య, వ్యాపార సంస్థల సముదాయాల యజమానులు తమ భవనాల ఎలివేషన్ కు అడ్డుగా వస్తున్నాయని సంవత్సరాలు తరబడి పెరిగి, నీడను నీడనిస్తు, పర్యావరణానికి దోహద పడుతున్న చెట్లను నిర్దాక్షణంగా నరికివేస్తున్నారు. ఇటీవల గోదావరి గట్టు రోడ్డు, విద్యుత్తు ఎస్సీఈ కార్యాలయం ఎదురుగా త్యాగరాజ గాన సభ ఆవరణలో ఉన్న 50 సంవత్సరాల నిద్ర గన్నేరు చెట్టును నరికివేసి ఆ స్థలంలో హోర్డింగ్ బోర్డులు ఏర్పాటు చేయడం స్థానికులు మండిపడు తున్నారు. ఏవి అప్పారావు రోడ్ లోని హెచ్డిఎఫ్సి బ్యాంక్ బ్యాంకు వద్ద ఉన్న 60 సంవత్సరాల చెట్టును నరికి వేశారు. స్థానిక గాంధీ నగర్ కొత్తగా ఏర్పాటు చేసిన హాస్పిటల్ వద్ద కూడా చెట్లను నరికి వేశారు. నగరంలో గత కొంతకాలంగా కలప మాఫియా గుట్టుగా పనిచేస్తుందని, విద్యుత్ వైర్లు తగులుతున్నాయని వంకతో సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారుల అనుమతులు లేకుండానే చెట్లను యంత్రాలతో కటింగ్ చేసి తరలించూకపోతున్నారని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెట్లను నరికే ముందు సంబంధిత ప్రాంతంలో స్థానిక ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణలో తీసుకోవాలని, చెట్లను నరికే వ్యక్తులకు, ప్రైవేట్ సంస్థలకు అధికారులు అనుమతి పత్రాలు జారీ చేయాలని పలువురు సూచిస్తున్నారు. ఇకనైనా నగరంలో పర్యావరణ పరిరక్షణ కాపాడే విధంగా కార్పొరేషన్, ప్రభుత్వ శాఖల అధికారులు సమిష్టి కృషి జరపాలని పర్యావరణ సంఘాలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి



# గోకవరం మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

- వ్యవసాయ, హార్టికల్చర్ పంట నష్టం గుర్తింపు పనులు వేగవంతం చేయాలి
- సకాలంలో నివేదిక అందచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలు



**గోకవరం, పెన్ పవర్, అక్టోబరు 30 :** మొంథా తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంటల వివరాలు పూర్తి స్థాయిలో అంచనా వేసే క్రమంలో జిల్లా అధికారులు మండల, గ్రామ స్థాయి సిబ్బందితో పరస్పర సమన్వయంతో నష్టం అంచనా నివేదిక సమగ్రంగా సిద్ధం చేసి, సకాలంలో సమర్పించాలని కలెక్టర్ కీర్తి చేకూరి తెలియ చేశారు.మొంథా తుఫాను ప్రభావంతో నష్టపోయిన ప్రాంతాలను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్వయంగా పరిశీలించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం వివరాలు ప్రత్యక్షంగా తెలుసుకుని రైతులతో మాట్లాడారు. "పంట నష్టం గుర్తింపు పనులు వేగవంతంగా , పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. రైతులకు సకాలంలో సహాయం అందించేందుకు నష్ట అంచనాలను అన్ని ప్రభుత్వ శాఖల విభాగాలు సమన్వయంతో పని చేయాలి" అని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు.

ఎగువనున్న ఏజెన్సీ ప్రాంతాల్లో అధిక వర్షాల కారణంగా ఏర్పడిన ముంపు పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారు. అచ్చియ్యపేట పరీవాహక ప్రాంతంలో ఊర కాలువలు మూసుకుపోవడం వల్ల నీటినిల్వ సమస్యలు తలెత్తుతున్నట్లు స్థానికులు వివరించగా, పూడికతీత పనులు వెంటనే చేపట్టి నీటి పారుదల సౌకర్యాలు మెరుగుపరచాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.అనంతరం తంటికొండ గ్రామంలో కలెక్టర్ నీటమునిగిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్ట వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ మరియు హార్టికల్చర్ పంటల నష్టం అంచనా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. "ప్రతి ఎకరా స్థాయిలో ఖచ్చితమైన వివరాలు సేకరించి, నష్టం నివేదికను హేతుబద్ధంగా సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపవలసి ఉన్న దృష్ట్యా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా ఈ ప్రక్రియ లో వ్యవహరించాలి" అని కలెక్టర్ సూచించారు.

అచ్యుతాపురం గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, వర్షాల సమయంలో గ్రామంలో నీరు నిల్వ కాకుండా ఉండేలా సక్రమ డ్రెయినేజ్ వ్యవస్థ కల్పించాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా ఠానా వంతెన, ఠానా సెంటర్ ప్రాంతాలను కూడా కలెక్టర్ పరిశీలించారు.రాజమండ్రి%-%భద్రాచలం ప్రధాన రహదారి గోకవరం మీదుగా వెళ్లడం దృష్ట్యా, వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, సంబంధిత శాఖాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

ఈ పర్యటనలో ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్, డ్వామా పిడి ఎం.నాగమహేశ్వరరావు, కోరుకొండ డీఎస్పీ కె.శ్రీకాంత్, తహసీల్దార్ పి. రామకృష్ణ, ఎంపీడీఓ గోవింద్, మండల వ్యవసాయ అధికారిణి రాజేశ్వరి, ఇరిగేషన్ ,ఇతర శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు శిరీష, రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ లో మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ కీర్తి చేకూరి పరిశీలన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30**: మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలైన రాజమహేంద్రవరం రూరల్ రాజవోలు, కడియం మండలం ఆవ ప్రాంతాలను గురువారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సందర్శించి రైతులతో మాట్లాడం జరిగింది. మొంథా తుఫాను కారణంగా మునిగిన వరి పొలాలు, ఒరిగిన పంటలను పరిశీలించిన కలెక్టర్ రైతులకు ప్రభుత్వ యంత్రాంగం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, పంట నష్టాలను పూర్తి స్థాయిలో అంచనా వేయడానికి వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్టపరిహారం కోసం సరైన నివేదిక ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొ న్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ నిపుణులు పంట మునిగిన, ఒరిగిన సందర్భాల్లో రైతులు అనుసరించవలసిన సస్య రక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటల పునరుద్ధరణకు మార్గదర్శకాలు అందజేశారు. ఈ సందర్శనలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు, తహసిల్దార్లు శ్రీనివాస్, సునీల్ కుమార్, ఇతర వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావంతో 16 వేల హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

జిల్లా కలెక్టర్ షాన్ మోహన్



**పెద్దాపురం, పెన్ పవర్, అక్టోబర్ 30** : మొంథా తుఫాను కారణంగా సుమారు 16 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సకిలి తెలిపారు. మండల పరిధిలోని కాండ్రకోట గ్రామంలో దబ్బ కాలువ వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని రెవెన్యూ , ఇరిగేషన్ అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏలేరు జలాశయం నుంచి ఏడు వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడం జరిగిందని, ఈ నేపథ్యంలో నీరు ఇళ్లలోకి చేరకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారని, దీనిపై రైతులు, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తతతో వ్యవహరిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో కె.శ్రీరమణి, జల వనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె. గోపీనాథ్, డీఈలు ఎ. రవికుమార్, ఎ.జనార్ధన్, కె.శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక పట్టివేత



**ఎటపాక,పెన్ పవర్,అక్టోబర్ 30:**అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ ను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గురువారం

ఎటపాక మండలం గుండాల, పురుషోత్తమ పట్నం గోదావరి నది ఒడ్డు సమీపములో రాత్రి 1 సమయంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుం డం తో రెవెన్యూ అధికారుల కు సమాచారం అందడంతో ట్రాక్టర్ నీ పట్టుకొని సీజ్ చేశారు.

ఎవరైన అక్రమంగా ఇసుక, మట్టి రవాణా తెలిస్తే చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ కారం. సుబ్బారావు తెలిపారు.

# అరటి, వరి రైతులను ఆదుకుంటాం





✸ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**రావులపాలెం పెన్ పవర్, అక్టోబర్ 30**
మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న అరటి, వరి, ఉద్యాన, కూరగాయల పంటల రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.
గురువారం ఆయన రావులపాలెం మండలం రావులపాడు గ్రామంలో తుఫాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అరటి తోటలను సందర్శించి రైతులతో మాట్లాడారు.
రైతులు ఒక్కో అరటి చెట్టుకు రూ.200 వరకు ఖర్చు అయ్యిందని, తుఫాను గాలులకు చెట్లు పూర్తిగా పడిపోయి భారీ నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యేకు వివరించారు. వారి బాధలు విని ఎమ్మెల్యే చలించిపోయారు.
తక్షణమే నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసి, పరిహారం చెల్లించే ప్రక్రియను ప్రారంభించాలని వ్యవసాయ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వం నిర్ణయించినట్లుగా ి అరటికి ఎకరాకు రూ.14,000,వరికి ఎకరాకు రూ.8,000 కూరగాయల పంటలకు ఎకరాకు రూ.10,000 నష్టపరిహారం అందజేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.
నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.
అనంతరం ఎమ్మెల్యే తుఫాను గాలుల కారణంగా పడిపోయిన వరిపొలాలను కూడా పరిశీలించారు.

# 47 డివిజన్ లో బాధితులకు ఎమ్మెల్యే చంటి నిత్యావసర సరుకులు పంపిణీ



**ఏలూరు అక్టోబర్ 30 పెన్ పవర్:** ముంథా తుఫాన్ ప్రభావంతో ఏలూరు పరిసర ప్రాంతాలు వరద ముప్పు చుట్టుముట్టిన నేపథ్యంలో ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో బాధిత ప్రజలకు గురువారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి వరద ప్రభావిత ప్రాంతాల్లోని 47 డివిజన్ లో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముంథా తుఫాన్ కారణంగా ఇళ్లను విడిచి పునరావాస కేంద్రాలకు తరలించబడిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. ప్రతి బాధితునికి రూ.1000 నగదు సహాయంతో పాటు బియ్యం, కూరగాయలు, నూనె, కొవ్వొత్తులు, తాగునీరు, మందులు వంటి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన సహాయం అందించేందుకు అన్ని విభాగాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు.

# రైతు ముంగిట్లోకి ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు పరిశీలన



**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 30:** సీతానగరం మండలంలోని సీతానగరం లంక ప్రాంతాలలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఉద్యాన పంటలైన బొప్పాయి కూరగాయల తోటలను శాస్త్రవేత్తలు ఉద్యాన శాఖ సంయుక్తంగా రైతులు పొలాలను పరిశీలించారు. దెబ్బతిన్న తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పిచ్చి క్యారీ చేయాల్సిన ఎరువులను డా పుష్ప, శాస్త్రవేత్త కేవీకే పందిరి మామిడి సూచించారు. అరటి తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తోటల్లో నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా నీరు తీసివేసి తోటలను ఆరేలా చేసి ప్రతి అరటి చెట్టుకు 100 గ్రాముల యూరియా 80 గ్రాముల పొటాషియం వేసుకోవాలని. బొప్పాయి మొక్క మొదల నీటిని తీసివేసి మెటాలాక్సిల్ ఎంజి 3 గ్రాములు లేదా కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ల నీటిని కలిపి బొప్పాయి మొదల దగ్గర పోయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్తలతో ఉద్యాన శాఖ అధికారి పి రినిఎక్స్టెన్షన్ అధికారి సౌమిత్రి, గ్రామా సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్ల నిర్మాణాల నాణ్యతను పరిశీలించిన కమిషనర్ రాహుల్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30**
రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపం ఉంటే ఉపేక్షించేది లేదని కమిషనర్ రాహుల్ మీనా హెచ్చరించారు. దానవాయిపేట, పప్పుల వీధి, పందిరి వారి వీధి, సాయికృష్ణ థియేటర్ రోడ్డు, కంచుమర్తి వారి వీధులలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల నిర్మించిన రోడ్ల నాణ్యతను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యమైన మౌలిక వసతులు అందించడంలో ఎలాంటి రాజీపడవద్దన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, ఈఈ మాధవి, ఏఈలు, ఇతర సిబ్బంది ఉన్నారు.
కమిషనర్ రాహుల్ మీనా ను కలిసిన చాంబర్ పాలకవర్గ సభ్యులు
స్థానిక నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనన్ ని చాంబర్ ఆఫ్ కామర్స్ పాలకవర్గ, కార్యవర్గ, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అభినందించారు.

# కోళ్లను దొంగిలించిన నలుగురి అరెస్టు




**గోకవరం, పెన్ పవర్, అక్టోబరు 30 :** తంటికొండ గ్రామానికి చెందిన కొవ్వాడ బాబురావు తన ఇంటి వద్ద పెంచుకుంటున్న నాటు కోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదుపై పోలీసులు తక్షణమే కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి నాటు కోళ్ల దొంగతనం చేసిన ఆవుల గోపి కొత్తపల్లి రమేష్ పిల్లల సురేంద్ర మేడికొండ అనిల్ కుమార్ అను నలుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి సుమారు 30 వేల రూపాయలు విలువ గల నాటు కోళ్లు స్వాధీనపరచుకున్నట్లు ఎస్సై వివిఎస్వీ పవన్ కుమార్ తెలిపారు.నిందితులను అరెస్ట్ చేసి, న్యాయపరమైన చర్యల కోసం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గోకవరం మండల పరిధిలో ఎవరైనా ఇటువంటి దొంగతనాలు లేదా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా వారిపై కఠినంగా వ్యవహరించి చట్టప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు తరలించబడతారని హెచ్చరించారు.

# మేజిక్ డ్రైనేజీతో మురుగు నీరు నిర్వహణ. ఏపీడీ శ్రీనివాస్ విశ్వనాథ్



**రంపచోడవరం, పెన్ పవర్, అక్టోబర్ 30 :** మురుగు నీరు నిర్వహణ లో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకురానున్నది దానిలో భాగంగా గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గృహాల సముదాయంలో మేజిక్ డ్రైనేజీలు ఏర్పాటు చేయనున్నామని రంపచోడవరం డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు రంపచోడవరం మండలానికి పైలట్ ప్రాజెక్ట్ గా రూ ఒక లక్ష 50 వేల నిధులతో మేజిక్ డ్రైనేజీ మంజురు కాగా వాటికి సంబందించిన నిర్మాణ పనులు ఐ.పోలవరం గ్రామ పంచాయితీ ఇర్లపల్లి గ్రామంలో రంపచోడవరం మండలం ఉపాధి హామీ సిబ్బంది చేపట్టారన్నారు. దానిలో భాగంగా గురువారం ఏపీడీ శ్రీనివాస్ విశ్వనాథ్ నిర్మాణం జరుగుతున్న మేజిక్ డ్రైనేజీ ప్రాంతాన్ని సందర్శించి సాంకేతిక సిబ్బందికి పలు సూచనలు చేసారు. సందర్భంగా శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడితు నాణ్యతలో రాజీ పడకుండా కొలతలు మేరకు నిబంధనలను దృష్టిలో ఉంచుకొని మేజిక్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ ప్రోగ్రాం అధికారి సత్యనారాయణ, జూనియర్ ఇంజినీర్ ఏడ్విన్ బాబు సాంకేతిక సహాయకులు సూర్రెడ్డి, శేఖర్, వాకా వీరన్న, క్షేత్ర సహాయకుడు వీరామణి తదితరులు ఉన్నారు.

# తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఆర్డీవో కృష్ణ నాయక్ పరిశీలన




**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ :30:**మాందా తుఫాను ప్రభావిత ప్రాంతాలను రెవెన్యూ డివిజన్ అధికారి ఆర్. కృష్ణ నాయక్ గురువారం సీతానగరం మండలంలో వంగలపూడి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పంట పొలాలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారి గౌరీదేవి మండల తాసిల్దార్ అంకం శ్రీనివాస్ రెవెన్యూ సంరక్షణ తదితర శాఖల అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో క్షేత్రస్థాయిలో రైతులతో ముఖాముఖి మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 9, వేలహెక్టార్లు వరి పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంజనా వేయడం జరిగిందనిఅలాగే తుఫాన్ వల్ల నష్టపోయిన పంట నమోదు 48 గంటల్లో పూర్తి చెయ్యాలని అధికారులకు తెలిపారు. నష్టపోయిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతు పంట నష్టం వివరాలు సరిగా నమోదు చేసి ప్రభుత్వం అందించే సహాయం పొందేలా అధికారులు చూసుకోవాలి అని పేర్కొన్నారు ఈ సందర్శనలో ఎంపీడీవో యం భారతి, అగ్రికల్చర్ వివిఏలు, కొంచెం చంద్ర భాస్కరరావు, సింగవరం గ్రామ సర్పంచ్ సంగన చిన పోసియ్య, తదితరు రైతులు పాల్గొన్నారు.

# అంటు వ్యాధులు ప్రబలకుండా విద్యార్థులను చైతన్యం చేయాలి

✸ మండల అభివృద్ధి అధికారి వెంకట రామన్



**ఆత్రేయపురం, పెన్ పవర్ అక్టోబర్ 30:**అధిక వర్షాల కారణంగా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యార్థుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వెంకట రామన్ అన్నారు.
ఆత్రేయపురం మండలం లోల్ల ఆదర్శ పాఠశాలలో, అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్" కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సీజనల్ ఫీవర్స్ నివారణకు ఉచిత హోమియో మందుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీడీవో వెంకట రామన్, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.మండల విద్యాశాఖ అధికారి పి.వి. వరప్రసాద్ మాట్లాడుతూ, పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రతతో పాటు పర్యావరణ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, వాసుకి, సాయిరాం, గోవిందు, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఏపీ ఉపాధ్యక్షుడిగా వంటిపల్లి



**టీ నర్సాపురం, పెన్ పవర్,అక్టోబర్ 30 :**ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పోలవరం నియోజకవర్గం టీ నర్సాపురం మండలం కె.జగ్గవరం గ్రామస్తులు వంటిపల్లి వెంకటేశ్వరరావు నియమి తులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోన శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి గో%శీ%ట్ల రామ్మోహన్రావు లిఖిత పూర్వక ఆదేశాలను గురువారం జారీ చేశారు.వంటిపల్లి వెంకటేశ్వరరావు గతంలో కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్, ఏపీ టెలికం అడ్వైజర్ బోర్డ్ వైస్ చైర్మన్, రైల్వే బోర్డు నెంబర్ గా పదవులు చేశానన్నారు. అంకితభావంతో వైశ్య ఫెడరేషన్ ఐక్యత బలోపేతం అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన వంటిపల్లి వెంకటేశ్వరరావు అన్నారు.

## కాలువలు పొంగి పల్లపు ప్రాంతాలు జలమయం

- మండలంలో జిల్లాలోనే అత్యధిక వర్షపాతం నమోదు



**గోకవరం, పెన్ పవర్, అక్టోబరు 30 :** గురువారం తెల్లవారుజామున కురిసిన కుండపోత వర్షం, ఎగువన ఏజెన్సీ ప్రాంతంలో కురిసిన అధిక వర్షానికి కాలువలు పొంగి మండల కేంద్రం గోకవరంలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.మండలంలో గురువారం జిల్లాలోనే అత్యధిక వర్షపాతం 52 మి.మీ నమోదవడం విశేషం .అధిక వర్షాల కారణంగా ను ,ఊరకాలువ పొంగడంతోను డ్రైవర్స్ కాలనీ, అచ్చియ్యపేట,మురళీనగర్, ఆర్టీసీ బస్టాండు వెనుక ప్రాంతం,పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీలు జలమయమయ్యాయి.జగ్గంపేట రోడ్డులోని డ్రైవర్స్ కాలనీ వద్ద వరదనీరు రోడ్డపై ఉధృతంగా ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.ఊరకాలువ ఉధృతంగా పొంగిప్రవహించడంతో సంజీవయ్యనగర్ వాసులు ఆందోళనకు గురయ్యారు.అచ్చియ్యపేట ప్రాంతంలో వర్షపునీరు ప్రవహించే మార్గంలేక డ్రైనేజీ నీటితో కలిసి వీధుల్లో నిలిచిపోవడంతో ప్రజలు నానా అవస్థలకు గురయ్యారు.ఈ ప్రాంతాలలో కలెక్టర్ కీర్తి చేకూరి పర్యటించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## అవినీతిపై కాలయాపన ఎందుకు...

- అంబేద్కర్ యువజన సంఘం కొక్కెర పార్టీ రవీంద్ర సూటి ప్రశ్న



**కూనవరం,పెన్ పవర్,అక్టోబర్ 30.**కూనవరం మేజర్ పంచాయతీలో అవినీతి జరిగిందని తెలిసిన అధికారులు కాలయాపన ఎందుకు చేస్తున్నారని,నోటీసులు ఇచ్చారు గడువు ముగిసింది ఇంకెంతకాలం గడువు కావాలని టేకులబోరు లో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొక్కెరపాటి రవీంద్ర అధికారులను ప్రశ్నించారు.ఈ సందర్భంగా కొక్కెరపాటి రవీంద్ర మాట్లాడుతూ అవినీతి దర్యాప్తుని మరింత వేగవంతం చేసి జరిగినటువంటి అవినీతి దర్యాప్తు రికార్డ్ ను ప్రజల ముందు ఉంచాలని అన్నారు. అవినీతిపై నోటీసు గడువు ముగిసిన సందర్భంగా ఇంకా అవినీతి జరక్కుండా అరికట్టాలని,తక్షణమే సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలని ఆయన ఈ సందర్భంగా అన్నారు.అదేవిధంగా అంబేద్కర్ యువజన సంఘం వెనక కొంతమంది ఉండి నడిపిస్తున్నారని అనే తప్పుడు ప్రచారాలను సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. చేతనైతే ప్రజల ముందుకు వచ్చి ప్రజల పక్షాన అవినీతిపై పోరాటం చేయాలని కోరారు.అవినీతిపై పోరాడే అంబేద్కర్ యువజన సంఘం వెనక మేము ఉన్నామని చెప్పుకునే వారు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు.సంఘం తరపున అవినీతిపై ప్రశ్నిస్తే స్థానికులు కాదని ఎక్కడి నుంచో వచ్చినవారు మా పంచాయతీ అవినీతి పై వాళ్ళకెందుకని చెప్పుకునే కొంతమంది అవినీతిపరులు మాట్లాడుకునే మాటలని అంబేద్కర్ యువజన సంఘం ఖండిస్తుందని, భారత దేశ పౌరుడు ఓటు హక్కు కలిగిన వ్యక్తి ఎక్కడైనా పోటీ చేయొచ్చని,భారత దేశ పౌరుడిగా ఉన్న వ్యక్తి భారత దేశంలో ఎక్కడైనా ప్రశ్నించవచ్చని అన్నారు.రుద్రంకోట మరియు కూనవరం పంచాయతీల మధ్య అన్నదమ్ములు సంబంధం ఉందని అటువంటప్పుడు ప్రజల పక్షాన అవినీతిపై ప్రశ్నిస్తే తప్పేంటని తప్పుడు ప్రచారాలు చేసే వారికి సూటిగా అడుగుతున్నానని ఆయన అన్నారు.ఈ సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు కొవ్వాల రాజా, కూనవరం గ్రామస్తులు ఎర్ర చౌదరి,సూరం రాము తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టం 55 శాతం రైతులు . నష్ట పరిహారం దరఖాస్తు చేసుకోండి.





**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 30**కపిల్ కపిలేశ్వర పురం మండలం లోని గ్రామాల్లో 55 శాతం వరిపంట రైతాంగం నష్టపోయినట్లు గురువారం మండల వ్యవసాయ అధికారి బలుసు'రవి మీడియాకు తెలిపారు. మాన్తా తుఫాన్ కారణంగా మండలం లో వరి సాగు అయిన 6602 హెక్టార్ల వరి పంట లో సుమారుగా 55% అనగా 3882 హెక్టార్ల వరి పంట వెన్ను విరిగి,నీట మునిగి నేలకొరిగి నీట మునిగి పాడయ్యే అవకాశం ఉందని క్షేత్ర స్థాయిలో సిబ్బంది తో పర్యటించి అంచనా వేసినట్లు ఆయన తెలిపారు.రైతులు పొలం లో మిగిలిన పంట ను రక్షించుకోవడానికి ప్రయత్నం చేయాలని దీనికోసం నీరు బయటకు పోవుటకు కాలువలు ఏర్పాటు చేసుకోవాలనీ తెగుళ్ల వృద్ధి చెందకుండా ప్రాపికోనజోల్ 1.2మిలి లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని అలాగే పంటలో గింజ గట్టిపడే దశలో ఉన్న పంట అధిక వర్షాలకు గురి అయితే పొలంలో నీరు అంతర్గత కాలువల ద్వారా తొలగించాలి. నిరంతర వర్షాల వల్ల గింజలోనిద్రావస్థ తొలిగి నిలబడి ఉన్న మరియు పడిపోయిన చేలలో మొలక వచ్చే అవకాశం ఉన్నది. కోత దశలో నిలిచిన లేదా పడిపోయిన పంటలో కంకిలో మొలకలు కనపడితే, 5% ఉప్పు ద్రావణం (50 గ్రాములు కల్లు ఉప్పు లీటరు నీటి లో కలిపి పిచికారీ చేయాలి. ఇది మొలకెత్తడాన్ని మరియు రంగు మారడాన్ని తగ్గిస్తుంది అని రైతులకు సూచించారు రైతులెవరూ అధైర్య పడవద్దని పంట నష్టపరిహారం అంచనా కోసం గ్రామ స్థాయి బృందాలు పొలాలను పరిశీలించి నమోదు చేస్తారని తెలియజేస్తున్నాము ప్రభుత్వ ఉత్తర్వులప్రకారం 33% కంటే అదనంగా నష్టపోతే ఒక హెక్టారుకు 25 వేల పరిహారం అందుతుందని ఇది ఈ పంట నమోదు చేసుకున్నవారికి ఇస్తామని మండల వ్యవసాయ అధికారి బి రవి తెలియజేశారు నేలటూరు వెదురుమూడి ,కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు చేశారు పంట నష్ట పరిహారం కోసం రైతులు తమ ఆధార్ కార్డ్, పాస్బుక్ జిరాక్స్ ,కౌలు కార్డ్, బ్యాంక్ అకౌంటు కాపీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు,వ్యవసాయ కూలీలు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల పడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కంబాల..





**కోరుకొండ, పెన్ పవర్,అక్టోబర్ 30:** కోరుకొండ మండలం జంబూపట్నం గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన అయ్యప్ప స్వాముల పడి పూజ కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత ఆయనకు అయ్యప్ప స్వాములు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను కూడా అయ్యప్ప స్వాముల పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణయే తన ప్రధాన ధ్యేయమన్నారు. వీలైనంతవరకు ఇతరులకు సహాయ పడాలని కోరారు. ప్రతి చోట కూడా గోవుల సంరక్షించుకుని, పురోహితులను గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు పురోహితులకు కంబాల శ్రీనివాసరావు 10,000 వేలు రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ పునరావాస కేంద్రంలో భోజన ఏర్పాటును పరిశీలించిన తుమ్మలపల్లి రమేష్.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 30:**మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ విస్తృత పర్యటన చేస్తున్నారు. జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం రామకృష్ణాపురం గ్రామంలో తుమ్మలపల్లి రమేష్ ఆదేశాల మేరకు జనసేన నాయకులు, జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ మెంబర్ దేగల విజయ్ కుమార్ తుఫాన్ బాధితులకు భోజనాలు ఏర్పాటు చేసారు.గురువారం రామకృష్ణాపురంలో తుపాన్ బాధితులకు భోజన ఏర్పాట్లను పరిశీలించారు. జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్తోపాటు ఈ కార్యక్రమంలో జన సేన నాయకులు దేగల విజయ్ కుమార్, కిర్లంపూడి మండలం ఉపాధ్యక్షులు గంధం ప్రభాకర్, భగవాన్, బోండా నంది బాబు, రామకృష్ణాపురం జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పద్దాలమ్మ గుడి అన్నసమారాధన కార్యక్రమానికి కంబాల 20,000 వేలు విరాళం..

**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 30:**తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం కాపవరం గ్రామంలో పద్దాలమ్మ తల్లి గుడి వద్ద గతంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమానికి




విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు కోరుకొండ ఆయన కార్యాలయంలో ఇరవై వేలు రూపాయలు విరాళం కమిటీ సభ్యులకు అందించారు.

## న్యాయవాదులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి సమీక్ష

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30**

తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లో గురువారం ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి ఎం. మాధురి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి శ్రీమతి బి. పద్మ వారి ఆధ్వర్యంలో ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో ఫ్యామిలీ కోర్ట్ జడ్జి శ్రీమతి ఎం. మాధురి వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నియ మించబడిన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతి గురించి సమీక్షించారు. కేసులను శీఘ్రం గా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కేసులకు సంబంధించి ఇబ్బందులు ఎదురైయితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు వెంటనే తెలియజేయాలని సూచించారు. క్రిమినల్ కేసులకు సంబంధించిన బెయిల్ అర్జీల వివరాలు కూడా తెలుసుకున్నారు.



# కరప మండలంలో 3500 ఎకరాల పంట నేలమట్టం..

## - రైతన్నకు అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణమూర్తి హామీ!



**కరప, పెన్ పవర్, అక్టోబర్ 30:** దమొంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలు, వీచిన పెనుగాలులు కరప మండలంలోని రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. చేతికొచ్చిన వరి పంట నేలమట్టం కావడంతో అన్నదాతలు ఆందోళనలో మునిగిపోయారు. ఈ విపత్కర పరిస్థితుల్లో, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి తడిసిన, పడిపోయిన పంట పొలాలను స్వయంగా పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. గురువారం మండలంలోని పాతర్లగడ్డ, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, విజయ రాయుడుపాలెం, యండమూరు, జీ భావారం, సిరిపురం, వేళంగి, కూరాడ, పెద్ద కొత్తూరు, వాకాడ, వేములవాడ, కరప, కొరిపల్లి, జెడ్ బావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. కరప మండలంలో సాగులో ఉన్న మొత్తం 15 వేల ఎకరాల ఖరీఫ్ పంటల్లో సుమారు 3500 ఎకరాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం పంటలు గింజ గట్టిపడే కీలక దశలో ఉన్నందున నష్టం మరింత అధికంగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా పిల్లి సత్యనారాయణ మూర్తి మీడియాతో మాట్లాడుతూ, నష్టపోయిన రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అన్నివేళలా రైతులకు అండగా ఉంటుందని, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే మండలంలోని 18 ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. సిరిపురం, జడ్ బావరం గ్రామాల్లో నష్టం తీవ్రంగా ఉందని పేర్కొంటూ, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి, పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయాలని, రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా, రైతులు ఎంతమంది క్రాఫ్ ఇన్సూరెన్స్ చేయించుకున్నారో తెలుసుకుని, తక్షణమే ఒక నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆయన కోరారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, అన్నదాతలు కలత చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బుంగా సింహాద్రి కూటమి నాయకులు మద్దూరి స్వామి, గండి వెంకటేశ్వరరావు, చీపురుపల్లి జయేంద్ర బాబు, పంపన కన్నారావు, పులపకూర శుభ మహేష్, అనుకుల రాంబాబు, పేపకాయల సత్తిబాబు, ఆట్ల గోవిందరాజు, వనుం నారాయణరావు, గొల్లపల్లి బుజ్జి, పలివెల జానకీ రామయ్య, గంధం లక్ష్మీనారాయణ, గంటా వీరన్న చౌదరి, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, పుణ్యమంతుల అన్నవరం, జోకా అప్పలరాజు, గండి బుజ్జి, జెల్దాని నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# మా గ్రామాన్ని కూడా ముంపుగా గుర్తించండి...



**కూనవరం,పెన్ పవర్,అక్టోబర్ 30.** పోలవరం ప్రాజెక్ట్ వలన సాగు భూములు ముంపుకు గురవుతున్నందున మండలంలోని ముల్లూరు గ్రామంలో 2008,2009 సంలో ముఖ్యమంత్రిగా రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఒక ఎకర భూమికి లక్ష 15 వేలు నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.అప్పటినుండి ఇప్పటివరకు ఆ గ్రామాన్ని స్టక్చర్,ఆర్ అండ్ ఆర్ సర్వే చేయలేదని ఆవేదనతో మహిళలు తెలిపారు.ఆనాటి నుండి ఇప్పటివరకు పంట నష్టపరిహారం, రైతు భరోసా,రైతుకు సంబంధించిన వ్యవసాయ పనిముట్లు,ఎరువులు మరియు విత్తనాలు ఇప్పటివరకు అధికారులు అందించిన దాఖలాలు లేవని అన్నారు.మా భూములకు ప్రభుత్వం నుండి రావలసిన రాయితీలు అందడం లేదని అధికారులను అడిగితే పోలవరం నష్టపరిహారం మీ భూమిపై అందుకున్నారని అన్నారు.2009 నుండి ఇప్పటివరకు గోదారి వరదలు వచ్చి పంట నష్టపోయిన నష్టపరిహారం ఇవ్వడం లేదని చెప్పారు.మా గ్రామాన్ని ఇప్పటికైనా గుర్తించండని,మా గ్రామానికి స్ట్రక్చర్,ఆర్ అండ్ ఆర్,పునరావాసం కల్పించాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# 44వ ఐడిఏ రాష్ట్ర స్థాయి దంత వైద్య సదస్సు గోడపత్రిక ఆవిష్కరణ




**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 29:** స్థానిక నాగమల్లితోట వద్ద ఉన్న శ్రీ సత్య దంత వైద్యశాలలో, నవంబర్ 21, 22, 23 తేదీలలో విజయనగరంలో జరగనున్న 44వ ఐడిఏ (ఇండియన్ డెంటల్ అసోసియేషన్) రాష్ట్ర స్థాయి దంత వైద్య సదస్సు గోడపత్రికను డా. గోరంట్ల సతీష్ బాబు, డా. సుధాకర్ నాయుడులతో కలిసి డా. అడ్డాల ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డా. గోరంట్ల సతీష్ బాబు మాట్లాడుతూ, "దంత వైద్యులు తమ వృత్తిలో అధునాతన జ్ఞానం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి రాష్ట్ర స్థాయి సదస్సులు కీలక వేదికలు. డిజిటల్ డెంటిస్ట్రీ,ఆధునిక వైద్య పద్ధతులు, కొత్త పరికరాలపై అవగాహన పెంపొందించుకోవచ్చు.ఈ సంవత్సరం విజయనగరం ఐడిఏ శాఖ సదస్సు నిర్వహించడం గర్వకారణం.ప్రతీ పాల్గొనేవారికి ఇది స్మరణీయంగా నిలుస్తుంది" అని అన్నారు.డా. సుధాకర్ నాయుడు మాట్లాడుతూ, "ఈ సదస్సులో ప్రఖ్యాత నిపుణులు అందించే ఉపన్యాసాలు, హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్‌లు దంత వైద్యుల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుస్తాయి.క్లినిక్ నిర్వహణ,రోగులతో కమ్యూనికేషన్,మార్కెటింగ్ తదితర అంశాలపై విలువైన మార్గదర్శనం లభిస్తుంది. ప్రముఖ దంత ఉత్పత్తుల కంపెనీలు తమ తాజా పరికరాలు, మెటీరియల్స్, సాఫ్ట్‌వేర్‌లను ప్రదర్శించనున్నాయి" అని తెలిపారు.డా.అడ్డాల మాట్లాడుతూ, "రాష్ట్ర స్థాయి సదస్సులు దంత వైద్యుల వృత్తిపరమైన ఎదుగుదలకు దోహదం చేస్తాయి. ఇలాంటి సదస్సులు రోగులకు మరింత నాణ్యమైన సేవలు అందించడానికి ప్రేరణనిస్తాయి. మానసిక ఉల్లాసం కోసం కూడా ఇది చక్కని వేదిక. మన రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో దంత వైద్యులు పాల్గొనాలని ఆశిస్తున్నాం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఏ సభ్యులు డా. వి.వి. రావు, డా. రఘురామ్, డా. సిరాజ్, డా. కృష్ణమోహన్, డా. పద్మావతి, డా. శ్రీవల్లి, డా. దీప, డా. సువర్ణ, డా. మూర్తితో పాటు విజయనగరం దంత వైద్యులు పాల్గొన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి గృహం లక్ష్యంగా ప్రభుత్వం సిద్ధంగా ఉంది

## కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ ప్రియా సౌజన్య సమీక్ష



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30** రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి స్వంత గృహం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ ప్రియా సౌజన్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ ప్రియా సౌజన్య గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా హౌసింగ్ ప్రధాన అధికారి కార్యాలయాన్ని సందర్శించి, గృహ నిర్మాణ సంస్థ పనితీరుపై సమీక్షించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్. బుజ్జి, జిల్లా హౌసింగ్ సిబ్బంది ఆమె ను కలిసి, జిల్లాలో జరుగుతున్న గృహనిర్మాణ కార్యక్రమాలపై సమగ్ర వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రియా సౌజన్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళు లేని పేదలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన %-% గ్రామీణ (2.0) పథకం ద్వారా గృహనిర్మాణం వేగవంతం చేయాడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్రము, రాష్ట్రం కలిసి పేదల సంక్షేమం దిశగా ఈ పథకం విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. అర్హులైన కుటుంబాలు తమ ప్రాంతంలోని గృహనిర్మాణ శాఖ ఏ ఈ కార్యాలయాలు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుల ద్వారా ఆవాస్ ప్లస్ యాప్‌లో దరఖాస్తులు సమర్పించ వచ్చని ప్రియా సౌజన్య వివరించారు. జిల్లాలో మూడు లక్షల గృహ ప్రవేశాలు పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్య మని, గృహనిర్మాణం పేదల జీవన ప్రమాణాలను మార్చే దిశగా పెద్ద మలుపు తీసుకు వస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన మూడు లక్షల గృహప్రవేశాల లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని హౌసింగ్ శాఖ వేగవంతంగా చర్యలు కొనసాగిస్తోందనీ జిల్లా హౌసింగ్ అధికారి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ బుజ్జి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,794 గృహాల లక్ష్యానికి 7,394 గృహాలు పూర్తై 69 శాతం పురోగతి సాధించామని తెలి పారు. మిగిలిన 3,400 గృహాలను నవంబర్ చివరినాటికి పూర్తి చేయడానికి అన్ని నియోజకవర్గాల హౌసింగ్ ఇంజనీర్లు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్. బుజ్జి, కార్య నిర్వాహక ఇంజనీర్ సి. హెచ్. వేణుగోపాలస్వామి (కొవ్వూరు డివిజన్), రాష్ట్ర హౌసింగ్ జేఏసీ అధ్యక్షులు కె. ఎస్. చక్రవర్తి, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తుంది.

* ఆర్ టి సి మాజీ విజయనగరం చైర్మన్ బాలకృష్ణ




**కపిలేశ్వరపురం పెన్ పవర్:** అక్టోబర్ 30డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కపిలేశ్వరపురం మండలం లోని గ్రామాల్లోగడచిన గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ముంతా తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు తో కూడిన వర్షాలకు వరి చేలు నేలకొరికి నీటి లో ఉన్న వరి చేలనూ ఆంధ్ర ప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర ఆర్ టి సి విజయనగరం మాజీ జోనల్ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో .మాట్లాడారు.సుమారు ఎకరాకు 25వేలు నుండి 30 వేల వరకూ రైతులు వరకు పంట పెట్టుబడి పెట్టినట్లు, గింజ దశలో వున్న వరిచేలు నీటిలో నానుతూ, కుళ్ళుతున్న గింజ దశలోవున్న వరి చేలు చూసి రైతాంగం తనతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు..కపిలేశ్వరపురం మండలం పరిదిలో నల్లూరు,వడ్లమూరు,కాలేరు,కపిలేశ్వరపురం, టేకి, అంగర తదితర గ్రామాల్లో నెక్కంటి బాలకృష్ణ తుఫాను కు వరి వరి చేలు పాడై దిక్కుతోచని రైతులను పరామర్శించి, భరోసా ఇచ్చారు. ఎన్ డి ఎ కూటమి ప్రభుత్వం తగిన నష్ట పరిహారం అందిస్తుందని రైతుల తో హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు ముంతా తుఫాన్ ప్రభావం తో జన నష్టం జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులను,ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారని నెక్కంటి బాలకృష్ణ కొనియాడారు. అయితే కోత దశలో వున్న వరిచేలు నేలకొరిగి నీటిలో నానుతూ రైతులకు తీవ్ర నష్టం మిగిల్చిందని బాల కృష్ణ వాపోయారు. రైతు పక్షపాతి అయిన సీఎం చంద్రబాబు నాయుడు తుఫాన్ తగ్గిన వెంటనే బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సందర్శించి, వ్యవసాయ రైతులకు జరిగిన నష్టాన్ని పరిశీలించారని అన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పంట సాగు భూములను పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన తర్వాత రైతులకు తగిన పరిహారం అందచెయ్యడం జరుగుతుందని నెక్కంటి బాల కృష్ణ పేర్కొన్నారు

# మండలంలో తుఫాన్ పీడిత ప్రాంతాలను సందర్శించినప్రత్యేక అధికారి...



**అడ్డతీగల,పెన్ పవర్,అక్టోబర్ 30:** గురువారంమంతా తుపాన్ ప్రభావం తోవేటమామిడి, చేనుపాకలు మరియు అనిగేరు గ్రామములను మండల ప్రత్యేక అధికారి అడ్డతీగలతాసిల్దార్ సందర్శించారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా, గ్రామాలలో ఇళ్ల పరిసర ప్రాంతాలలో నిలువ ఉన్న నీటిని వెంటనే మోటార్ ద్వారా బయటకు పంపించేలా చర్యలు తీసుకోవలసిందిగా పంచాయతీ కార్యదర్శి కి మరియు విఆర్వో కి ఆదేశం జారీ చేశారు . అనిగేరు వెళ్లే రోడ్డు కల్వర్టు కోతకు గురికావడంతో, దీనికి సంబంధించి అడ్డతీగల మండల ఇంజనీరింగ్ అధికారినీ ఆపని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాల్సిందిగా తాసిల్దార్ ఆదేశాలు జారీ చేశారు .

# పెసా గ్రామసభ వాయిదా...



**అడ్డతీగల,పెన్ పవర్, అక్టోబర్ 30:** గురువారం ఉదయం10:30 గంటల నుండి పెసా గ్రామసభ అడ్డతీగల గ్రామ సచివాలయం నందు గ్రామ సర్పంచి పప్పుల. చిట్టమ్మ అధ్యక్షతన అడ్డతీగల ఎంఈఓ పి. శ్రీనివాసరావు పెసా ఎన్నికల అధికారిగా పెసా గ్రామ సభను నిర్వహించారు. మధ్యాహ్నం 2.00 గంటల వరకు వేచి చూసినప్పటికీ,తగినంత కోరం సభ్యులు లేనందున మరియు ఉపాధ్యక్షులు, కార్యదర్శి అభ్యర్థుల నుండి నామినేషన్ దరఖాస్తులు కూడా రాలేదు. సర్పంచ్ నిర్ణయం మేరకు నవంబర్ 4 తారీకు మధ్యాహ్నం 2.00 గంటలు నుండి పేసా గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని అని ఎన్నికల అధికారి తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రాంబాబు, సూర్య కుమార్ , డిజిటల్ అసిస్టెంట్ ,వెల్ఫేర్ అసిస్టెంట్ పిసీ గ్రామ సభ్యులు , సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# తుఫాన్ కారణంగా కూలిపోయిన ఇళ్లను పరిశీలించిన తాసిల్దార్

**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 30:** మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని పెద్దపళ్ళ గ్రామంలో బొబ్బావారి కాలనీలో గుత్తుల సత్యనారాయణకు చెందిన ఇళ్లు కూలిపోయింది.కూలిపోయిన ఇళ్లను ఆలమూరు తాసిల్దార్ కేజే ప్రకాష్ బాబు స్థానిక వీఆర్వోతో కలిసి గురువారం పరిశీలించారు. తుఫాన్ వల్ల నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. అలాగే ప్రభుత్వం నుండి రావలసిన సదుపాయాలకు తగిన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణి, వీఆర్వో ఉదయ్ కుమార్, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# మొంథా తుఫాను ప్రభావం పరిశీలించిన బీజేపీ కన్వీనర్ దూడల శంకరనారాయణ



**కాజులూరు, పెన్ పవర్,అక్టోబర్ 29:**మొంథా తీవ్ర తుఫాను ప్రభావంతో భారీగా నష్టపోయిన వరిపంట పొలాలను భారతీయ జనతా పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ పరిశీలించారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన కాజులూరు మండలంలోని దుగ్గుదుర్రు, అయితపూడి తదితర గ్రామాలను సందర్శించి, తుఫానుకు కూలిపోయిన పంట పొలాలను రైతులతో కలిసి స్వయంగా పరిశీలించారు. పంటల నష్టం కారణంగా కష్టాల్లో ఉన్న కౌలు రైతులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ, "పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ ప్రభావం రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. వరి పంటతో పాటు ఉద్యాన పంటలు కూడా నష్టపోయాయి. ప్రతి రైతు వెన్నంటే ఉండి, తగిన నష్టపరిహారం అందేలా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది" అని తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ముందు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సింగన శ్రీనివాసు, పాట్నీడి సత్తిబాబు,గరగ సత్తిరాజు, పైడికొండల దుర్గారావు, చాగంటి కృష్ణ, అడపా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు కూలిపోయిన బాధితులకు చేయూత అందించిన తుమ్మలపల్లి రమేష్..



**కిర్లంపూడి, పెన్ పవర్,అక్టోబర్ 30:**మొంథా తుపాను ప్రభావం కారణంగా జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం పాలెం గ్రామంనికి చిక్కిరెడ్డి సోమరాజు ఇల్లు కూలిపోవడంతో గురువారం జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి పరిశీలించి వారి కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్బంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి తగిన సాయం అందజేసేలా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలెం బాబి, ధర్మపురి,గన్నిరాజు అడబాల నల్లబాబ,వర్రె శివ రామ కృష్ణా,అడబాల ఉషా కిరణ్,సమ్మిటి అయ్యప్ప,సిద్ధ తులసీరామ్ దాడి ధర్మ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లాకు ఆధునిక క్యాన్సర్ స్క్రీనింగ్ బస్

* టెండర్లు ఆహ్వానం

**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 30:**కాకినాడ జిల్లాలో క్యాన్సర్ నిర్ధారణ సేవలను విస్తరించేందుకు ఆధునిక వైద్య పరికరాలతో కూడిన క్యాన్సర్ స్క్రీనింగ్ బస్ సరఫరా కోసం టెండర్లు ఆహ్వానించినట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కలెక్టర్ పేర్కొన్న ప్రకారం, ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీ ద్వారా టర్న్‌కీ పద్ధతిలో బస్ సరఫరా, ఇన్స్టలేషన్, ప్రారంభం వంటి అంశాలకు సంబంధించిన షీల్డ్ టెండర్లు పిలుస్తున్నారని చెప్పారు. టెండర్ డాక్యుమెంట్లలో పేర్కొన్న సాంకేతిక స్పెసిఫికేషన్లకు ఖచ్చితంగా అనుగుణంగా ఉండాలని సూచించారు.క్యాన్సర్ స్క్రీనింగ్ బస్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 3,41,07,736/-, మరియు రిఫండబుల్ ఈ ఎండి రూ. 8,52,693/- (2.5%)గా నిర్ణయించబడింది. టెండర్ డాక్యుమెంట్లు నవంబర్ 1వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నవంబర్ 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయ పని గంటల్లో విక్రయించబడతాయి. టెక్నికల్ బిడ్ ఓపెనింగ్ నవంబర్ 17, 2025 మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుంది.హార్డ్ కాపీ సమర్పణ స్థలం: ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఛాంబర్, కాకినాడ.టెండర్ డాక్యుమెంట్ పొందేందుకు ఆసక్తి గల బిడ్డర్లు రూ. 20,000/- విలువైన డిమాండ్ డ్రాఫ్ట్‌ను ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు , సి ఎస్ ఆర్%ళి%బీపీసీఎల్%రి%" పేరిట జాతీయ బ్యాంక్ ద్వారా తీసుకుని సమర్పించాలి.ఇంతకు ముందు ప్రభుత్వ శాఖలకు లేదా ఏజెన్సీలకు ఆధునిక వైద్య పరికరాలతో కూడిన క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సులను సరఫరా చేసిన బిడ్డర్లకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని కలెక్టర్ తెలిపారు.

## సంచార జాతులకు ఆర్థిక సహాయం



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,అక్టోబర్ 30 :** తుఫాన్ బాధితులకు కూటమి ప్రభుత్వం చేయూతగా నిలుస్తుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. గురువారం జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చంచార జాతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం, 25 కిలోల బియ్యం, కిలో పప్పు, కిలో నూనె, రేషన్ సరుకులు పంపిణీ చేశారు. తుఫాన్ బాధితులకు తగిన సహాయం అందజేయడం కూటమి ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. మండలంలోని 13 కుటుంబాలకు, నియోజకవర్గంలోని 50 కుటుంబాల కు గుర్తించి ఆర్థిక సహాయం అందజేశారు .ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం వి రమణ, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ జనసేన, టిడిపి మండల అధ్యక్షులు పసుపులేటి రాము, సంకపల్లి సాయి, సర్పంచి చిరి జగదాంబ, తహసిల్దారు ఉదయ్, కూటమి నాయకులు సిరి శ్రీను, బండారు అనీలు, పానుగంటి శ్రీను, రాయి సుబ్బారావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఈవీఎంల భద్రతకు చర్యలు ప్రారంభించాలి - కలెక్టర్ షణ్మోహన్





**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 30:**ఎన్నికల సమయంలో ఉపయోగించే ఈవీఎం, వీవీపాట్స్ భద్రతను కట్టుదిట్టం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం పరిధిలోని ఈవీఎం గోదామును కలెక్టర్ షణ్మోహన్, రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక, పోలీసు శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. గోదాములో అమలు చేస్తున్న భద్రతా చర్యలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, అధికారులను వివరణ కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ, "ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి నెల ఈవీఎం గోదాముల భద్రతా స్థితిని సమీక్షించి నివేదిక పంపుతున్నాం. ఏ చిన్న నిర్లక్ష్యం కూడా జరగకూడదు. ఈవీఎంలను రక్షించడానికి అవసరమైన అన్ని చర్యలు వెంటనే తీసుకోవాలి" అని సూచించారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగం డీటీ ఎం. జగన్నాథం, రెవెన్యూ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చేనుపాకలు గ్రామంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శిఈ.స్వప్న కుమారి పర్యటన..





**అడ్డతీగల,పెన్ పవర్,అక్టోబర్ 30:** తుపాను కారణంగా బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు, అడ్డతీగల మండలం గో%శీ%డోలు పంచాయతీలో చేనుపాకలు గ్రామంలో భారీగా ఇళ్ల చుట్టూ వరదనీరు చేరడంతో ఆ గ్రామంలోని గ్రామస్తులు ఇళ్ల నుండి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్నారని తెలిసిన వెంటనే, బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈ. స్వప్న కుమారి జెసిబి సాయంతో వరద నీరును, ఊరు వెంబడి డ్రైనేజీ తీయించి వరద నీటిని బయటకు పంపించారు. ఊరిని చుట్టుముట్టిన వరద నీరు తగ్గుముఖం పట్టడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. తాము ఆపదలో ఉన్నప్పుడు తమకు సాయం చేసిన స్వప్న కుమారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జి సాగర్, జి. నిశాంత్, కె. రాఘవ, ఎం. రాము, విజయ్, పండు, వీఆర్వో , పంచాయతీ సెక్రెటరీ ఇంజనీరింగ్ అసిస్టెంట్, బాబి, గ్రామస్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెట్ట గొల్లగూడెంలో సూపర్ శానిటేషన్ కార్యక్రమం





**ఏలూరు అక్టోబర్ 30 పెన్ పవర్:** మొందా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు లింగపాలెం మండలం రంగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని మెట్ట గొల్లగూడెంతో పాటు గ్రామంలోని అన్ని అన్ని వార్డులలో అంటువ్యాధులు ప్రబలకుండా డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు గ్రామములో గ్రామ సర్పంచ్ ముసునూరి రాము ఆధ్వర్యంలో సూపర్ శానిటేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు రంగాపురం గ్రామ కార్యదర్శి ఎం చంద్రశేఖర్ తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీలు శుభ్రపరచి డ్రైనేజీల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, దోమల వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ తదితర రసాయనాలు పెద జల్లినట్లు తెలిపారు.

## గోపాలపురంను ముంచెత్తిన వరద నీరు







**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 30** :మండలంలోని బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గోపాలపురం, వాదాలకుంట, జగన్నాధపురం,పెద్దాపురం తదితర గ్రామాలు వరద ముంపుకు గురయ్యాయి.రాత్రి సమయంలో వర్షం విపరీతంగా కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.వాదాలకుంట నుండి గోపాలపురం వచ్చే రహదారి,గోపాలపురం నుండి చిట్యాల వెళ్లే రహదారి వర్షం నీటితో నిండిపోయాయి.అలాగే జగన్నాధపురం తదితర గ్రామాల్లో వరద నీరు ఇళ్లలోకి వెళ్ళిపోయాయి.గోపాలపురం పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న రహదారి,గోపాలపురం ప్రధాన రహదారి నుండి పెద్దగూడెం వెళ్లే రహదారిపై సుమారు మీటర్నర లోతు నీరు నిలిచిపోయింది.స్థానిక రజక పేటలో పలు గృహాలు జరదిగ్బంధంలో చిక్కుకున్నాయి.ఆయా కుటుంబాల వారు ఉదయం లేచి చూసేసరికి చుట్టూ నీరు చేరి ఉండడంతో బెంబేలెత్తిపోయారు.స్థానికంగా ఉన్న అధికారులు,నాయకులు స్పందించి నీరును బయటకు తరలించే ప్రయత్నం చేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం.

* మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా
* కమిటీలను ఏర్పాటు చేసిన మండల అధ్యక్షుడు ఆకుల పెద్దోడు..





**ఎటపాక,పెన్ పవర్,అక్టోబర్ 30:**ఎటపాక మండల పరిధిలోని గుండాల గ్రామంలో గురువారం మండల వైసీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైయస్ఆర్సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారని, ఇందులో భాగంగా ఎటపాక మండలం కన్వీనర్ ఆకుల వెంకట రామారావు (పెద్దోడు), రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేష్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు, ఈ కమిటీలను ఎమ్మెల్సీ అనంత బాబు, నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామని తెలిపారు, ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు శీలం నాగేశ్వరరావు, గుండాల ఉపసర్పంచ్ తోట శశి కుమార్, గుండి రాము, ఎర్ర గొల్ల నరసింహారావు, ధారా రమేష్, చల్ల మని, కాకాని సురేష్, ముక్కు కల్పన, ముత్తి బోయిన రాము, ముక్క శీను, మై సాక్షి రాఖీ, కొత్తపల్లి సతీష్, ఎడ్ల బాలాజీ, గుండి రామారావు, నడిపింటే దుర్గాప్రసాద్, కొత్తపల్లి సాత్విక్, మామిడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను కు దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన





**గంగవరం, పెన్ పవర్ ,అక్టోబర్ 30:**తుఫాన్ నేపథ్యంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను గురువారం పందిరిమామిడి
కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్తలు, వ్యవసాయ అధికారి కలిసి, మండలంలో సూరంపాలెం, గార్లపాడు,కొత్తడా లలో సందర్శించారు.
ఈ సందర్భంగా సైంటిస్ట్- డాక్టర్ ప్రవీణ్ బాబు మాట్లాడుతూ- గడచిన రెండు రోజులుగా జిల్లాలో మోంద తుఫాన్ కు వరి,మిరప,పత్తి మరియు ఇతర ఉద్యాన పంటల్లో నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.వరిలో నీరు తగ్గిన తరువాత హెక్సాకొనజోల్ 400 మి.లీ/ఎకరాకు పిచికారీ చేయడం ద్వారా మాగుడు తెగులు వ్యాప్తి తగ్గుతుందని సూచించారు.దుంపలో కాండం కుళ్ళు తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ మందు ద్రావణం మొక్క మొదలు తడిచేలా నేలలో పోయాలి,మొక్కపై కూడా పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.ప్రత్తిలో కాయకుళ్ళు తెగులు రాకుండా హెక్సాకొనజోల్ లీటర్ నీటికి 2 మిల్లీ లీటర్ల చొప్పున,పిచికారీ చేయాలని సూచించారు.నీరు నిలబడ్డ చోట మురుగు నీరు పోయే సౌకర్యం కల్పించి,నేల ఆరిన వెంటనే తగు మోతాదులో ఎరువులను పంటలకు అందించాలని సూచించారు.క్షేత్ర పరిశీలనలో
సైంటిస్ట్ డాక్టర్.వీరాంజనేయులు,మండల వ్యవసాయ అధికారి- విశ్వనాథ్ వి ఏఏ-భాస్కర్,రైతులు పాల్గొన్నారు.

# సర్వం కోల్పోయిన రైతులకు ఆర్థిక సాయం చేయాలి-వైసీపీ నేతల డిమాండ్



**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 30 :**భారీ తుఫాను,ఈదురు గాలులు,భారీ వర్షాల కారణంగా మండలం లోని గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వ్యవసాయ వరి పంట పొలాలు నీట మునిగి రైతులు కోలుకోలేని దెబ్బ తగిలిందని రైతులందరికీ పంట నష్ట పరిహారం విధిగా ఇవ్వాలని వైసీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మండల పార్టీ అధ్యక్షులు గూటం సత్యనారాయణ ఆధ్వర్యం లో గురువారం వైస్ ఎంపీపీ భానుప్రసాద్ రైతుబంధు అధ్యక్షులు పుట్టా కృష్ణబాబు, మెర్ల రామకృష్ణ ,చూడే సూరిబాబు చోడే నానిబాబు మండల పరిషత్ విప్ పలివెల మధు తదితరులు తుఫాను కారణం గా నీట మునిగిన పంట పొలాలను వారు సందర్శించారు.మేడిశెట్టి దుర్గారావు అంగర సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ప్రగడ అర్జున్ రావు బుంగ దావీదు బెల్లం సుధీర్ వల్లూరు సుబ్బారావు జువ్వల చంటి నాగబత్తుల శ్రీహరి నాగబత్తుల కళ్యాణ బెల్లం కిషోర్ గడ్డం రాజా దాసిరాజు బీర వెంకట్ నాగ బత్తుల గణేష్ గోడి సతీష్ బెల్లం లచ్చయ్య కనపర్తి కిట్టయ్య గోడి సునీల్ బీర సునీల్ రైతులను పరామర్శించి పంట నష్ట పరిహారం వచ్చే వరకూ వైసీపీ నాయకులు ప్రభుత్వం పై ఒత్తిడీ తెచ్చి రైతులకు ఆర్థిక న్యాయం జరిగే వరకూ పనిచేస్తారని భరోసా ఇచ్చారు

# దుళ్ళ లో శ్రీదేవి,భూదేవి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా పూర్ణాభిషేకం



### భారీ కార్తీక అన్న సమారాధన

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30**
కడియం మండలం దుళ్ళ గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీదేవి, భూదేవి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రవణా నక్షత్రం సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చరణలతో విశేషంగా పూర్ణ కుంభాభిషేకం పూజలు జరిగాయి. వేలాదిమంది భక్తుల సమక్షంలో ఉదయం 5 గంటల నుంచి అష్టోత్తర శతక (108) కలశ ములతో పంచామృతాలతో , పండ్ల రసములతో ఘనంగా పూర్ణ కుంభాభిక పూజలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ఆలయ కమిటీ నిర్వాహకులు, దాతలు, భక్తుల సహకారంతో భారీ ఎత్తున కార్తీక అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుళ్ళ పరిసర గ్రామల ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

# పుష్కరాల నాటికి దేవస్థానాలు అభివృద్ధి చేసి భక్తులకు సదుపాయాలు కల్పించాలి





- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- హితకారిణి చైర్మన్ గా డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్
- కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా కొయ్యల రమణ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ :**
రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఎండోమెంటు కమిటీలు వేస్తున్నామని, దేవస్థానాలను అభివృద్ధి చేసి, వాటి ఆస్తులను పెంచాలని, భక్తులకు సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు. సిటీలో ప్రతిష్టాత్మక హితకారిణి సమాజం ట్రస్టు చైర్మన్ గా డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్, శ్రీ ఉమా కోటిలిం గేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా కొయ్యల రమణ లు నియమితుల య్యారు. తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో గురువారం కమిటీలను ప్రకటించిన అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ( వాసు) మాట్లాడుతూ, చైర్మన్లతో పాటు కూటమి లోని టీడీపీ జనసేన బీజేపీ వారితో సభ్యులను నియమిం చామన్నారు. త్వరలో చందా సత్రం, శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్లు, సభ్యులను నియమిస్తామన్నారు. ఈ రెండు కమిటీలు వచ్చే నెలలో ప్రమాణ స్వీకారం చేస్తాయని చెప్పారు. రాజమండ్రి క్షేత్రపాలకుడు శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ ను నియమించిన అధిష్టానం పునః పరిశీలనకు వెళ్ళిందన్నారు. చైర్మన్లు, సభ్యులు వ్యక్తిగతంగా మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు.
హితకారిణి సమాజం సభ్యులు వీరే :
ఆదిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, మేడపాటి సాయి భాగ్యలక్ష్మి, కూచర్లపాటి లలితా రాణి, గుణ్ణం శ్యామ్ సుందర్, చెరుకుమల్లి అనంత సత్య నాగవల్లి, కొడమళ్ళ శ్రీనివాసరావు, మంచెం విజయకుమార్, తణుకు శేషు కుమారి, కిలారి వెంకట నాగలక్ష్మి ఉన్నారు.
కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం సభ్యులు:
పిల్లి ప్రసాద్, జొన్న సత్యవతి, అలజంగి దేవుడు, నిమిషకవి వెంకటేశ్వరరావు, గుబ్బల గంగా భవాని, జి.వి.ఆర్.రెడ్డి, తోట కిరణ్ ముద్దుకూరి అనురాధ, ముంగండ త్రివేణి, సమ్మంగి లక్ష్మీదుర్గ ఉన్నారు.

# కలపర్రు పంచాయతి లోసూపర్ శానిటేషన్ కార్యక్రమం





**ఏలూరు అక్టోబర్ 30 పెన్ పవర్:** మొందా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు పెదపాడుమండలం కలపర్రు గ్రామపంచాయతీ పరిధిలోని ద్వరకాసాయి ఆలయ ప్రాంతం తో పాటు గ్రామంలోని అన్ని అన్ని వార్డులలో అంటువ్యాధులు ప్రబలకుండా డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు గ్రామములో కూటమి నాయకుల ఆధ్వర్యంలో సూపర్ శానిటేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామ కార్యదర్శి సుమలత తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనేజీలు శుభ్రపరచి డ్రైనేజీల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి,రోడ్లపై నిలిచిన వర్షపు నిరు డ్రైనేజీలు లోకి మళ్లించి, దోమల వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ తదితర రసాయనాలు వెద జల్లినట్లు తెలిపారు.

# శాఖల సమన్వయంతో వరద నీరు నివారిస్తాం-ఎమ్మెల్యే మద్దిపాటి





**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 30 :**తుఫాను ప్రభావంతో నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది.గోపాలపురం మండలంలోని పెద్దాపురం గ్రామంలో కురిసిన వర్షానికి దళిత వాడలోని ఇల్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.అలాగే పంట పొలాలు నీటితో నిండిపోయాయి.విషయం తెలుసుకున్న గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు అధికారులతో కలిసి పెద్దాపురం గ్రామంలో పర్యటించారు.ముంపుకి గురైన ప్రాంతాన్ని పరిశీలించారు.వర్షం కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నష్టానికి సంబంధించిన వివరాలను సేకరించాలని ఆదేశాలు జారీ చేశారన్న విషయాన్ని గ్రామస్తుల దృష్టికి తీసుకువెళ్లారు.వర్షం కారణంగా ఇల్లు దెబ్బ తిన్నవారికి గృహాలు మంజూరు చేయడంతో పాటు పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం సైతం చెల్లించడం జరుగుతుందన్నారు.అయితే ఇప్పటికే నాయకులు స్పందించి బాధితులకు భోజనం వసతి సౌకర్యాలు కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.గ్రామంలో బాధితుల కోసం తయారు చేస్తున్న ఆహార పదార్థాలను దగ్గరుండి పరిశీలించారు.నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.ఆయా శాఖల అధికారుల సమన్వయంతో వరద నీటిని సాధ్యమైనంత తొందరగా నివారించే చర్యలు తీసుకుంటామన్నారు.తుఫాను వలన ఏ రకమైన నష్టం వాటిల్లకుండా అధికారులు,నాయకులు అంకిత భావంతో పనిచేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.వరద ప్రభావం రెండు మూడు రోజులు ఉండే నేపథ్యంలో నాయకులు మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ రెట్టించిన ఉత్సాహంతో సేవలు చేయాలన్నారు.అలాగే దేవరపల్లి గ్రామం,నల్లజర్ల మండలంలో వర్షాలు అధికంగా కురిసాయని అన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో కొంత ప్రమాదం తప్పిందన్నారు.ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు కొర్లపాటి రాము,కొర్లపాటి అన్నవరం,గన్నిన మురళి,ఎంపీడీవో రాజ మనోహర్,కూటమి నాయకులు,ఎస్పై మనోహర్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుపాన్ బాధితులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది.

-మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 30:**మొంథా తుపాన్ ప్రభావం వల్ల నష్టపోయిన బాధితులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు శరకణం రాజబాబు,బిజెపి సీనియర్ నాయకులు, గోనేడ ఎంపిటిసి, అల్లు శివరామ కృష్ణ అన్నారు. కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశాల మేరకు గురువారం
కిర్లంపూడి మండలంలో గోనేడ,రాజుపాలెం, వీరవరం గ్రామాల్లో మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న కాలవలు, పంట పొలాలను మండల శరకణం రాజబాబు ఆధ్వర్యంలో పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఆయా గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులకు చూపించారు. పంటలు నష్టపోయిన బాధిత రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండల ప్రధాన కార్యదర్శి కంటా కాశీ విశ్వనాథం, ఉపాధ్యక్షులు బుద్ధ పెద్దకాపు, కార్యదర్శులు బుద్ధ సత్యనారాయణ, భీమనాదుల వీరబాబు, బొడ్డేటి చిన్నబ్బాయి, ఆడారి రామచంద్ర రావు, బొడ్డేటి బాబురావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# ధారగడ్డ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన స్పెషలాఫీసర్




**వై రామవరం, పెన్ పవర్,అక్టోబర్ 30 :** మండలంలో అప్పర్ పార్ట్ లో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆశ్రమమండల స్పెషల్ ఆఫీసర్ దయానంద్
గురువారం తనిఖీ చేశారు.
9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థుల యొక్క స్టడీని పరిశీలించి, అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఉన్న స్టోర్ రూమ్ ను తనిఖీ చేయడం జరిగిందన్నారు. కూరగాయలు తాజా గా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు అందాలని సూచించారు. స్పెషలాఫీసర్ వెంట ఎంపీడీవో కే. బాపన్న దొర పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ నిర్మాణానికి ఆంధ్రులు ఐక్యత మవ్వాలి

- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక
- ఆద్యక్షుడు మేడా శ్రీనివాస్ పిలుపు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 30:** విభజన అనంతరం ఏ విధమైన అభివృద్ధి జరగక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నష్ట పోతుందని, జరుగుతున్న నష్టం పూడ్చలేనిదని ప్రజలు గ్రహించాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్తాపక ఆద్యక్షుడు మేడా శ్రీనివాస్ విజ్ఞప్తి చేసారు. ప్రస్తుతం చంద్రబాబు కూటమికి , జగన్ కు ఉన్న సమస్యల రీత్యా మోదీ సర్కార్ ను ప్రశ్నించలేని బలహీన స్థితిలో వారు వున్నారన్నారు. వారు ఆంధ్రప్రదేశ్ కు ఏమి సాధించ లేరన్నది వాస్తవమన్నారు.

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం , బావి తరాల అభ్యున్నతి కోసం ఐక్య పోరాటా నికి ప్రజలు సిద్ధం కావలని ఆయన పిలుపు ఇచ్చారు. ప్రత్యేక హెూదా , రాయితీలు, విభజన హామీలు ,యుద్ద ప్రాతిపదికన రాజధాని నిర్మాణం, పోలవరం జాతీయ ప్రాజెక్ట్ సాధన ,రామాయపట్నం మేజర్ పోర్ట్ సాధన, కడప ఉక్కు ఫ్యాక్టరి సాధన,

12 వ ఆర్ధిక సంఘం సిఫార్సు మేరకు కే జి బేసిన్ నుండి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి 50 శాతం ఆర్ధిక వాటా సాధన , యువత పై అక్రమ కేసులు లేని నిర్మాణం కోసం ఆంధ్రులంతా ఐక్యత మవ్వాలన్నారు. విద్యార్థులు, యువత, మేధావులు, న్యాయవాదులు , విద్యావంతులు , విశ్రాంత ఉద్యోగులు, జర్నలిస్ట్ లు , కార్మికులు, వ్యాపార, పారిశ్రామిక వేత్తలు , ఉద్యమ సంస్థలు, ఉద్యమ రాజకీయ పార్టిలు ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి కోసం ఐక్యపోరా టంచేయాలన్నారు.,



## తుఫాన్‌తో నష్టపోయిన రైతుల సమస్యలను ఎంపీ హరీష్ దృష్టికి తీసుకెళ్లిన బీజేపీ నాయకులు



**కాజులూరు, పెన్ పవర్,అక్టోబర్ 30:**మొంథా తుఫాన్ ప్రభావంతో కాజులూరు మండలంలో విస్తారంగా ఉన్న వరి పంట పొలాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని స్థానిక బీజేపీ నాయకులు తెలిపారు.మండల బీజేపీ అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ, బీజేపీ నాయకుడు బండారు సత్యనారాయణ తదితరులు అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాదుర్ ని కలసి, తుఫాన్ ప్రభావం కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ వల్ల పంటలు నేలమట్టం కావడంతో రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా వారు తుఫాన్ నష్టాన్ని ప్రభుత్వం తక్షణం అంచనా వేసి, రైతులకు తగిన పరిహారం చెల్లించా లనీ ఎంపీ హరీష్ మాదుర్ ని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పుణ్యమంతుల శివాజీ, బండారు సత్యనారాయ ణతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం





**జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 30 :** పోలీస్ అమరవీరుల వారోత్సవం సందర్భంగా జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. దర్భ గూడెం సెయింట్ పీటర్ అండ్ పాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, పోలీసులు నిర్వహించే నిత్య విధులు, ప్రజల భద్రత కోసం చేపట్టే చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు సీఐ బి. వెంకటేశ్వరావు ఎస్సై వి. క్రాంతి కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పోలీసు సేవలు సమాజ శాంతి, భద్రతకు పునాది అని అన్నారు. ప్రతి పోలీస్ అధికారి ప్రజల రక్షణకై నిరంతరం కృషి చేస్తారు అన్నారు. అమరవీరుల వారోత్సవం ద్వారా పోలీసులు ప్రాణాలు అర్పించిన త్యాగాన్ని గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని తెలిపారు. యువతలో దేశభక్తి, సేవాభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీస్ సిబ్బందిని ప్రశ్నలు అడిగి, పోలీసులు చట్టపరమైన విధులు ఎలా నిర్వర్తిస్తారో ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, మహిళా భద్రతా చర్యలు, శక్తి యాప్ వంటి అంశాలపై పోలీసులు వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా వినిపించి, భవిష్యత్తులో సమాజ సేవలో తమ పాత్రను గుర్తించుకునే ప్రేరణ పొందారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాన్ని స్మరించుకుంటూ విద్యార్థులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు, విద్యార్థుల మధ్య స్నేహపూర్వక బంధం మరింత బలపడిందని అధికారులు తెలిపారు.

## ఏలేరు కు వరద తాకిడి ప్రాజెక్ట్ జలాలను నియంత్రిస్తున్న అధికారులు.

జిల్లా కలెక్టర్ సూచనలతో ఇరిగేషన్ శాఖ సమర్థవంతంగా పనిచేసింది: ఎస్.ఈ. గోపీనాథ్.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 30:** తుఫాను తీరం దాటి వాయుగుండం గా మారడంతో ఏలేరు జలాశయ పరివాహ ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదయింది. దీంతో ఏలేరు జలాశయానికి వరద తాకిడి ఏర్పడింది. ఈ మేరకు ధవళేశ్వరం సర్కిల్ ఇరిగేషన్ ఎస్.ఈ. కె గోపీనాథ్ ఏలేరు జలాశయాన్ని గురువారం సందర్శించారు. ఏలేరు ఎగువ గిరిజన ప్రాంతాల్లో గత రాత్రి అడ్డతీగల లో 10 సెంటీమీటర్ల వర్షపాతం, రాజవొమ్మంగిలో నాలుగు సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. దీంతో ఏలేరు జలాశయానికి గురువారం ఉదయం 9 గంటలకు ఇన్ఫ్లోస్ పదివేల క్యూసెక్కుల నుంచి అకస్మాత్తుగా 38వేలకు చేరుకుంది. ప్రస్తుతం ఒంటిగంట నుంచి ఇన్ఫ్లోస్ 23000 క్యూసెక్కులు వస్తుంది. దీంతో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అనుమతితో గత వారం రోజులుగా 5000గా ప్రాజెక్టు దిగువ ప్రాంతాలకు వదులుతున్న అవుట్ ఫ్లోస్ ను 7 వేల క్యూసెక్కులకు పెంచడం జరిగిందని ఎస్.ఈ. తెలిపారు.

ఏలేరు ప్రాజెక్ట్ విషయంలో మీడియాతో గోపీనాథ్ మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్ట్ నిర్వహణకు ఇంజనీర్లు, సిబ్బంది కొరత ఉందని ప్రస్తుతం వరదల కాలం కాబట్టి మిగతా మైనర్ ఇరిగేషన్ నుంచి ఇంజనీర్లను, సిబ్బంది సేవలను తాత్కాలికంగా వినియోగించామన్నారు. ఏలేరు జలాలను ఎప్పటికప్పుడు నియంత్రిస్తూ ప్రాజెక్ట్ దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలకు ఏ విధమైన ప్రాణ, నష్టాలు జరగకుండా కృషి చేశామన్నారు. ముఖ్యంగా ఏలేరు దిగువున ఉన్న కిర్లంపూడి, సామర్లకోట, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, గొల్లప్రోలు, యు కొత్తపల్లి మండలాలకు చెందిన రైతులు పంట పొలాలకు తీవ్ర నష్టం జరగకుండా, ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గ్రామాల్లో దండోరా వేయించడం, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ తదితర శాఖల సహకారంతో ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు.

ఏలేరు ప్రాజెక్టు నిర్వహణ సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. గతంలో 47 మంది ఇంజనీరింగ్, సిబ్బంది పనిచేస్తుండేవారని 31 పోస్టులు ఖాళీలు అయ్యా యన్నారు. ప్రస్తుతానికి 6గురు మాత్రమే ఉన్నారన్నారు. ఈ విషయమే సిబ్బంది కొరత నివారించడానికి ఏప్రిల్ నెలలో 5వ తేదీన ఖాళీల భర్తీ కోసం ప్రభుత్వానికి నివేదించడం జరిగిందన్నారు. కానీ ఈ.ఎన్.సీ.లో ఫైల్ పెండింగ్ లో ఉందన్నారు. ఆర్థిక వనరులు లేక ఇంజనీర్లను, సిబ్బందిని నియమించలేకపోతున్నామన్నారు. ఏలేరు ప్రాజెక్టు ప్రాంతాల రైతులు, ప్రజలు భయపడాల్సిన పనిలేదని వరద పరిస్థితి నియంత్రణలో ఉందని గోపీనాథ్ తెలిపారు.

## అధికారులు సమన్వయంతో మెలగాలి-ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 30:**నియోజకవర్గంలోని అధికారులు సమన్వయంతో మెలగాలని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్ రాజు కోరారు. తుఫానును పురస్కరించుకొని చేపట్టవలసిన చర్యలపై నియోజకవర్గంలోని ఆయా శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నల్లజర్ల మండలం ప్రకాశరావు పాలెం లో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను మానవీయ కోణంలో నష్టాన్ని నమోదు చేసి ఆదుకోవాలని అన్నారు. అలాగే వర్షాలు ఈదురు గాలులు కారణంగా గృహాలు కోల్పోయిన కుటుంబాలకు నష్టపరిహారం అందించే విధంగా చూడాలన్నారు. అకాల వర్షాల కారణంగా నీరు కలుషితమైందని పంచాయతీ అధికారులు ప్రజలకు అందించే త్రాగు నీరును శుద్ధిచేసిన తరువాత మాత్రమేసరఫరా చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శాఖ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఆరోగ్యం పై పలు సూచనలు సలహాలు అందించవలసిన అవసరం ఉందన్నారు. ఈదురు గాలులు కారణంగా కొన్నిచోట్ల విద్యుత్ సమస్యలు తలెత్తయని విద్యుత్ స్తంభాలు నేలకు వరగడం, విద్యుత్ వైర్లు తెగి పడడం వంటివి జరుగాయన్నారు. ఆ సమస్యలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. అయితే తుఫాను ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు పని తీరును కొనియాడారు. ఈ సమావేశంలో గోపాలపురం ఎస్ఐ మార్కెట్ కమిటీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మ రాజు, నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొంతా ప్రభావంతో దంచి కొట్టిన వర్షం



పొంగి ప్రవహిస్తున్న సెలయేర్లు కాలువలు



**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 30 :** మొంతా తుఫాను ప్రభావంతో మండలంలో వర్షం దంచి కొట్టడంతో మండలంలో ఉన్న కొండ కాలువలు సెలయేర్లు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి.

ఈనెల 28,29 తేదీలలో తుఫాను ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ కారణంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, మండలంలో అధికారులను అప్రమత్తం చేసినారు. ఈనెల 28,29 తేదీలలో వర్ష ప్రభావం లేని ఏజెన్సీలో 29 తేదీ రాత్రి వర్షం దంచి కొట్టడంతో కొండ కాలువలు, సెలయేర్లు పొంగి ప్రవహిస్తున్నాయి. రెండు రోజులు విద్యుత్ సరఫరా లేకపోవడంతో త్రాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఫోన్ లు , ఫైబర్ నెట్, టీవీలు పనిచేయకపోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని, ఎక్కడ ఎటువంటి ఉపద్రవాలు జరుగుతున్నాయో తెలియని పరిస్థితి వచ్చిందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా లో అంతరాయం వల్ల మంచినీటి సౌకర్యం లేకపోవడంతో వర్షపు నీటిని ఒడిసి పట్టి నిత్యవసరాలకు ఉపయోగించుకున్నామని పలువురు తెలిపారు. ఏది ఏమైనా ఏజెన్సీలో కూడా మొంత తుఫాను ప్రభావం కచ్చితంగా కనిపించిందని పలువురు తెలిపారు.

## మున్సిపల్ కౌన్సిల్ అనుమతి లేకుండా పనులా...





**పెద్దాపురం :** కౌన్సిల్ అనుమతి లేకుండా పనులు ఎలా చేపడుతున్నారని మున్సిపల్ అధికారుల తీరుపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కౌన్సిలర్ అరెళ్ళ వీర్రాఘవులు మాట్లాడుతూ ఎవరి ఒత్తిడితో పనులు చేపడుతున్నారని, పనులు చేపట్టే ముందు కౌన్సిల్ కు తెలియజేయాలా వద్దా అని అధికారులను నిలదీశారు. ఆలాగే మున్సిపాలిటీలో జనరల్ ఫండ్స్ బ్యాలెన్స్ ఎంత ఉందో తెలియజేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణ బాపూజీ మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఫైలేరియా పరీక్షలు నిర్వహించాలని, ఈ విషయంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ 40 మీటర్ల పొడవైన డ్రైన్ ను నెలరోజులుగా పూర్తి చేయకుండా అలా వదిలేశారని, దీంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పనులు చేపట్టకపోవడానికి గల కారణం తెలియజేయాలని డిమాండ్ చేశారు. అలాగే కమ్యూనిటీ హాల్ కి సంబంధించిన బిల్లు చెల్లింపు విషయంపై అధికారులను ఆయన నిలదీశారు. మరో కౌన్సిలర్ త్సలికి సత్య భాస్కరరావు మాట్లాడుతూ పట్టణంలో ఇళ్లకు పన్ను విధింపునకు సంబంధించి స్పష్టత ఇవ్వాలని అన్నారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లోని సమస్యలపై ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కె. శ్రీకాంత్ రెడ్డి, మేనేజర్ యు. జ్యోతీరాణి, డిఈఈ డి.ఎస్. ప్రకాశరావు, ఆర్వో ఎస్. అచ్యుతరాజు, శానిటరీ ఇనస్పెక్టర్ బి. ఆదినారాయణ, టిపివో సిహెచ్. ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# దోసకాయలపల్లిలో శ్రీలక్ష్మీ దేవి ఆలయం, రామాలయాన్ని సందర్శించిన కంబాల





**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 30:** కోరుకొండ మండలం దోసకాయల పల్లి గ్రామంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు గురువారం పర్యటించారు. కమిటీ సభ్యులు, గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు తొలిత గ్రామంలోని శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, ఆయనకు పూలమాలలతో సత్కరించి, పట్టాభి సీతారాముల చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు మెటీరియల్ అందజేస్తానని ప్రకటించారు. అనంతరం రామాలయం ఆలయాన్ని సందర్శించారు. రామాలయం వర్షానికి కారిపోతుందని, నూతనంగా స్లాబ్ నిర్మించడానికి సహకారం అందించాలని కోరారు. నిర్మాణానికి ఎంత ఖర్చువుతుందో ఎస్టిమేషన్ వేసుకుని రావాలని కావలసిన సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సొతం డబ్బులు కోట్ల రూపాయలు ఖర్చు చేసి మూడు నియోజకవర్గల్లోని ప్రజలకు సేవా చేయడం జరుగుతుందన్నారు..ప్రతి గ్రామంలో కూడా మహిళలకు లక్కీ డ్రా నిర్వహించి పట్టుచీరలు అందించేలా చర్య తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు,ఆయా ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# ఆగడాల లంక పంచాయతిలో సూపర్ శానిటేషన్ కార్యక్రమం





**ఏలూరు అక్టోబర్ 30 పెన్ పవర్:** మొందా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు భీమడోలు మండలం ఆగడాల లంక గ్రామపంచాయతీ పరిధిలోని రాజీవ్ గాంధీ విగ్రహం ప్రాంతం తో పాటు, బి.సి.కాలనీ, ఎస్సీ కాలనీలతో పాటు గ్రామంలోని అన్ని అన్ని వార్డులలో అంటువ్యాధులు ప్రబలకుండా డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు గ్రామములో కూటమి నాయకుల ఆధ్వర్యంలో సూపర్ శానిటేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామ కార్యదర్శి బి.సోముల తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనేజీలు శుభ్రపరచి డ్రైనేజీల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి,రోడ్లపై నిలిచిన వర్షపు నిరు డ్రైనేజీలు లోకి మళ్లించి, దోమల వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ తదితర రసాయనాలు పెద జల్లినట్లు తెలిపారు.

# సమాచార హక్కు చట్టం అమలు చేయని అధికారులపై చర్యలు

**నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా హెచ్చరిక**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ అక్టోబర్ 30,**సమాచారహక్కు చట్టంను అమలు చేయని అధికారులపై తక్షణ చర్యలు ఉంటాయని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అధికారులకు హెచ్చరించారు. గురువారం కమిషనర్ చాంబర్ లో గార్డ్స్ ఫర్ ఆర్ టి ఐ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు, జాతీయ మహిళా కన్వీనర్ ఆకుల విజయభారతి, మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధరరావు కమిషనర్ కు పుష్పగుచ్ఛము ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాగేశ్వర రావు కమిషనర్ కు నగరపాలక సంస్థలో స.హా చట్టం సక్రమంగా అమలు కావడం లేదని అధికారులు చట్టం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ నీరుకారుస్తున్నారని వివరించారు. సెక్షన్ 5(1), 5(2)ప్రకారం బహిరంగంగా బోర్డు లు ప్రదర్శించడం లేదని కమిషనర్ దృష్టికి తెచ్చారు. స.హా చట్టం ప్రకారం సెక్షన్ 4(1)(బి) అధికారుల వద్ద లేదని పిర్యాదు చేశారు. సహా చట్టం కార్యకర్తలు ప్రశ్నిస్తే దూషణలకు పాల్పతున్నారని కమిషనర్ కు తెలిపారు. ఆర్ టి ఐ దరఖాస్తు వేస్తే పొంతనలేని సమాదానాలు ఇస్తూ సమాచార హక్కు చట్టం నిర్విర్వం చేస్తున్నారని మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళి ధరరావు కమిషనర్ తెలిపారు. కమిషనర్ రాహుల్ మీనా తన రికార్డులో ఈ విషయాలు రాసుకున్నారు. సహా చట్టం నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటానని సహా చట్టంపై నిర్లక్ష్యం తన దృష్టికి తీసుకువస్తే వారిపై చర్యలు తీసుకుంటానన్నారు.

## పంట నష్టాల నమోదులు పారదర్శకంగా జరగాలి.

**తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబు, ఎంపిడివో ఏ రాజు.**



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 30:**మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టాలు వాటిల్లిన పంటలను గుర్తించి పారదర్శకంగా నమోదులు చేయాలని తహసిల్దార్ కేజే ప్రకాష్ బాబు ,ఎంపిడివో ఏ రాజు సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు గురువారం మండలంలోని చింతలూరు, పెద్దపల్ల గ్రామాల పరిధిలోని వరి పంటలను సిబ్బందితో కలిసి వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది క్షేత్రస్థాయిలో వరి చేలను రైతులతో కలిసి చూస్తూ వేగంగా నమోదులు చేయాలన్నారు. నష్టపోయిన ఏ ఒక్క రైతును వదలకుండా పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే వరితో పాటు ఉద్యానవన పంటల నష్టాలను గుర్తించి నమోదు చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శులు వి.వేణి, వీరన్న చౌదరి, వీఆర్వోలు రాజశేఖర్, ఉదయకుమార్ సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ కే పోటీలకు ఎంపికైన విద్యార్థులు.



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 30:**ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ కే పోటీలలో ఇండియా ఉమెన్స్ సెలక్షన్స్ నందు ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన వారియర్ మాంక్స్ కుంగ్ ఫ్యూ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ సమస్థ గ్రాండ్ మాస్టర్ కె సత్తిబాబు తెలిపారు.గెలుపొందిన విద్యార్థుల వివరాలు ప్రకారం అండర్ 9 విభాగంలో 21 కేజీలకు సంబంధించి మారిశెట్టి స్నేహ ఉష సిల్వర్ మెడల్, అండర్ 11 విభాగంలో 32కేజీలకు సంబంధించి కర్రీ బాల శ్రీ నందిని బ్రాంచ్ మెడల్,అండర్ 14 విభాగంలో 50కేజీలకు సంబంధించి నిట్టూరి హర్షిత గోల్డ్ మెడల్,35కేజీలకు సంబంధించి కొత్తపేటకు చెందిన కలాటం శ్రీ మానస్వి గోల్డ్ మెడల్ సాధించారన్నారు. అయితే వీరు డిసెంబర్లో జరగబోయే సౌత్ జోన్ నేషనల్ కిక్ బాక్సింగ్ కే పోటీలలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు గెలుపొందిన విద్యార్థులను గురువారం వారియర్ మాంక్స్ కుంగ్ ఫ్యూ ఫౌండర్ వెల్ వెంకట రెడ్డి,జొన్నాడ తెలుగుదేశం నాయకులు తాడి శ్రీనివాస్ రెడ్డి(బట్టి శ్రీను) గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి),సీనియర్ ఇన్స్పెక్టర్ సూర్యతేజ రెడ్డి, కోచ్ పి నాని బాబు,శివ సురేష్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

# పంట నష్టాన్ని పరిశీలించిన కన్నబాబు: అండగా ఉంటామని రైతులకు హామీ!



**కరప, పెన్ పవర్, అక్టోబరు 30:** 'మొంథా' తుఫాను సృష్టించిన బీభత్సంతో పంటలు నష్టపోయిన రైతులకు వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, కాకినాడ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు అండగా నిలిచారు. గురువారం ఆయన కరప మండలంలోని యండమూరు, జి. భావవరం, సిరిపురం గ్రామాలలో విస్తృతంగా పర్యటించి, పంట పొలాల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయన రైతులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను, ఆవేదనను సానుభూతితో ఆలకించారు. తుఫాను ప్రభావంతో రోజుల తరబడి నీట మునిగి కుళ్లిపోయిన వరి పొలాలను చూసి కన్నబాబు చలించిపోయారు. మురుగునీటి పారుదల లేక, నిలబడి ఉన్న నీటిలో పాడైపోయిన పంటలను దగ్గరగా పరిశీలించారు. రైతుల కష్టాన్ని దగ్గరగా చూసిన కన్నబాబు, వారిని ఓదార్చి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను ఆయన ముందు వెళ్లబోసుకున్నారు. పెట్టుబడి కోసం అప్పులు చేశామని, చేతికి అందే సమయంలోనే తుఫాను కొట్టడంతో తమ బతుకుతెరువు ఎలా అంటూ పలువురు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. కేవలం పార్టీ నాయకుడిగానే కాకుండా, బాధ్యత గల ప్రజా ప్రతినిధిగా కన్నబాబు పొలాల్లోని బురద, నీటిని లెక్క చేయకుండా నడిచి, రైతుల గోడు విని వారికి భరోసానిచ్చారు. ఈ పర్యటనలో సర్పంచులు రొక్కాల గణేష్, కమిడి మంగాదేవి శంకర్, చింతా బుజ్జి, మాజీ సర్పంచ్ మారెళ్ళ రమణ, కాదా వెంకటేశ్వరరావు, నున్న వెంకటేశ్వరరావు, కరీం భాష, గరగ సూరిబాబు, రొక్కాల తారకేశ్, సింగినీడి వెంకటేశ్వరరావు(నాని), నల్లా బాలాజీ, వజ్రపు కామేశ్వరరావు, చెట్ల శేఖర్, చిన్నం వెంకటేశ్వరరావు(పండు), వనుం గంగారావుతోపాటు కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

## దీపోత్సవంలో బదిరెడ్డి దొర దంపతులు...

- దీపోత్సవాన్ని చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు..



**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 30:** కోరిన కోరికలు తీర్చే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దీపోత్సవ కార్యక్రమం గురువారం సాయంత్రం జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు బదిరెడ్డి దొర దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నెలరోజులపాటు స్వామి వారి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఎవరైనా స్వామివారికి అన్నదానానికి విరాళాలు ఇవ్వాలనుకునేవారు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించవచ్చునని అన్నారు.ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఈ కార్యక్రమంలో కర్రి లక్ష్మీ సరోజ గణేష్, బడగలపాటి శ్రీను, కామిశెట్టి దొరబాబు, తిరుమల చిట్టిబాబు, పచారి నరసింహమూర్తి, సుంకర శ్రీను గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## శృంగారాయునిపాలెం గ్రామంలో ఏలేరు కాలువకు గండి.

- భయం గుప్పిట్లో గ్రామస్తులు
- వేగంగా గండి పనులను చేపట్టిన అధికారులు.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 30:** ఏలేరు ప్రాజెక్టు నుండి ఒక్క సారిగా ఏడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో కిర్లంపూడి మండలం శృంగరాయనిపాలెం గ్రామంలో గండి పడింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తుఫాన్ ప్రమాదం తప్పి న్నప్పటికీ వరద ప్రమాదం తప్ప లేదని ముంపు గ్రామాల ప్రజలు అందరూ భయపడుతున్నారు. దీంతో కిర్లంపూడి తహశీల్దార్ చిరంజీవి గండి పనులను వేగవంతంగా చేపట్టారు. భూపాలపట్నం గ్రామ సర్పంచ్, మండల టిడిపి అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు, కరణం బూరయ్య,కాసా సంతోష్, ఆరీనే రాజేష్ పర్యవేక్షణలో పనులు చేపట్టారు ఎర్ర కాలువ కుడి గట్టుకు గండి పడడంతో ఇరిగేషన్ ఎమర్జెన్సీ వర్క్ గా గుర్తించి ముమ్మరంగా పనులు చేపట్టారు. తహశీల్దార్ జె చిరంజీవి రెవెన్యూ అధికారులు వీఆర్వో నూకరాజు పలువురు అధికారులు తదితరులు ఉన్నారు.

# అప్పర్ పార్ట్ లో స్పెషలాఫీసర్ సుడిగాలి పర్యటన







**వై రామవరం, పెన్ పవర్, అక్టోబర్ 30 :** మండలంలో అప్పర్ పార్ట్ లో ఉన్న ధారగడ్డ, గుర్తేడు,పాతకోట పంచాయితీలలో మండల స్పెషల్ ఆఫీసర్ దయానంద్ గురువారం సుడిగాలి పర్యటన చేశారు.

ఆయా పంచాయితీలలో సచివాలయాలను సందర్శించి సిబ్బందికి తగుచూచనలు చేయడం జరిగిందన్నారు. జాప్రా రైతులతో చర్చించడం జరిగిందన్నారు. అదే విధంగా గుర్తేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శించి సకాలంలో రోగులకు వైద్యం అందించాలని సూచించామని తెలిపారు. గుర్తేడు దారగడ్డ గ్రామాల మధ్య తుపాను కారణంగా రహదారికి అడ్డంగా పెద్ద చెట్టు పడిందని, దానిని తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే. బాపన్న దొర, ఏపీవో స్వామి, ఏబీఏఫ్ నీతి అయోగ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్‌తో రైతులకు తీవ్ర నష్టం





- నామవానిపాలెం, కోలంకలో వరి పొలాలు నేలమట్టం
- ప్రకృతి వైపరీత్యాలనుంచి రక్షణకు వాతావరణానుకూల వంగడాలు అవసరం
- డా. పి.వి. సత్యనారాయణ

**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 30:**ఇటీవలి మొంథా తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్ర డైరెక్టర్ డాక్టర్ పి.వి. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన నామవానిపాలెం, కోలంక గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో నేలనంటిన వరి క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్శనలో కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు విజయ్ కుమార్, మార్టేరు మరియు పెద్దాపురం వరి పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు కూడా పాల్గొన్నారు. పరిశీలన అనంతరం రైతులతో మాట్లాడిన డా. సత్యనారాయణ మాట్లాడుతూ, "గోదావరి ప్రాంతం అధిక దిగుబడులు సాధించే సామర్థ్యం కలిగినదే. కానీ వాతావరణ మార్పులను తట్టుకునే రకాలే భవిష్యత్తులో రైతుల రక్షకాలు" అని పేర్కొన్నారు.ప్రస్తుతం గోదావరి కృష్ణా డెల్టాలో సుమారు ఐదు లక్షల యాభై వేల ఎకరాల్లో నూతనంగా అభివృద్ధి చేసిన ఎంటియు%-%1318 రకం వరి సాగు చేస్తున్నారని తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల్లో అధికంగా సాగు చేస్తున్న స్వర్ణ రకాల పంటలు గింజతోడు కునే దశలో ఉండగా ఈ అకాల వర్షాల వల్ల సుమారు 75శాతం%-%80 శాతం వరకు నష్టం జరిగిందని వివరించారు. స్థానిక అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారని చెప్పారు.సన్న రకాలపై దృష్టి సారించాలి:

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు,వ్యవసాయ శాఖ కమిషనర్ సంయుక్తంగా రైతులకు అధిక ఆదాయం ఇచ్చే సన్న రకాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించినట్లు తెలిపారు.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట వంగడాలను ఎంచుకోవాలని రైతులను సూచించారు. జూన్‌లో ఖరీఫ్ పనులు ప్రారంభించండి: ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించేందుకు రైతులు జూన్ నెలలోనే ఖరీఫ్ పనులు ప్రారంభిస్తే, నవంబర్ నాటికి కోతలు పూర్తవుతాయని, తద్వారా రబీ సీజన్‌లో ఇబ్బందులు తగ్గుతాయని సలహా ఇచ్చారు. ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే విత్తనాలను ఎంచుకో వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డా. గిరిజా రాణి, డా. దయల్ ప్రసాద్ బాబు, డా. సీతారాం శర్మ, డా. రామభద్రరాజు, డా. సుధీర్ కుమార్, కరప ఏడీఏ బాబురావు, మండల వ్యవసాయ అధికారి వి.అశోక్, కోటిపల్లి డీసీ దాట్ల విజయ గోపాలరాజు, మాజీ సహకార సంఘాల అధ్యక్షులు దంతులూరి వెంకట నరసింహ రాజు, భూపతిరాజు రామచంద్రరాజు, జనసేన నాయకులు బొండా వెంకన్న, కోలంక సహకార సంఘం అధ్యక్షుడు బొండా వెంకట నరసింహ నాయుడు,అలాగే పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

## కొత్తూరు పంచాయతిలో సూపర్ శానిటేషన్ కార్యక్రమం





**ఏలూరు అక్టోబర్ 30 పెన్ పవర్:** మొందా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు పెదపాడు మండలం కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలోని బి.సి.కాలనీ, ఎస్సీ కాలనీలతో పాటు గ్రామంలోని అన్ని అన్ని వార్డులలో అంటువ్యాధులు ప్రబలకుండా డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు గ్రామములో కూటమి నాయకుల ఆధ్వర్యంలో సూపర్ శానిటేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామ కార్యదర్శి ఎం.వేంకటేశ్వర రావు తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో పారిశుధ్య కార్మికులతో డ్రైనేజీలు శుభ్రపరచి డ్రైనేజీల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి,రోడ్లపై నిలిచిన వర్షపు నిరు డ్రైనేజీలు లోకి మళ్లించి, దోమల వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ తదితర రసాయనాలు వెద జల్లినట్లు తెలిపారు.

## రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది.

- రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం



**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 30:**మొంథా తుఫాను ప్రభావం వరి రైతులపై అధికంగా పడిందని, ఉద్యాన, కూరగాయల పంటలు సైతం దెబ్బతిన్నాయని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం వ్యాఖ్యానించారు. గురువారం ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామంలో మండల బీజేపీ అధ్యక్షులు సుంకర శ్రీరాములు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులుతో కలసి పాలూరి సత్యనందం, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ వారు పర్యటించి అన్నదాతల ఇక్కట్లను పరిశీలించారు. పంట కోతకు వచ్చే సమయానికి తుఫాన్ రావడంతో వరి పొలాలు నేలనంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందుతుందన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన పంట వివరాలను నమోదు చేసి పరిహారం అందేలా చేస్తారని వారికి తెలియజేశారు. వరి ఎకరాకు రూ. 8వేలు, అరటి ఎకరానికి రూ. 14వేలు, కూరగాయల పంటలకు ఎకరాకు రూ. 10వేలు నష్టపరిహారంగా అందించనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిందని తెలియజేశారు. కర్షకులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ అసెంబ్లీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి స్వామి నాయుడు,కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మేడపాటి వెంకటకృష్ణారెడ్డి, ఆత్మ కమిటీ సభ్యులు మద్దింశెట్టి శ్రీనివాస్, నల్లిమిల్లి జ్యోతి రెడ్డి, మండల ఉపాధ్యక్షులు గంగిరెడ్డి,వీరి కృష్ణ, రేలింగి కొండ,తదితరులు పాల్గొన్నారు

## కష్టకాలంలో అండ: మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభుత్వ భరోసా!



**కరప, పెన్ పవర్, అక్టోబర్ 30:** 'మొంథా' తుఫాన్ సృష్టించిన బీభత్సం కారణంగా కకావికలమైన మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలబడింది. తుఫాన్ తీరం దాటిన వెంటనే సహాయక చర్యలను వేగవంతం చేస్తూ, బాధితులకు ఉపశమనం కలిగించేందుకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ స్వయంగా రంగంలోకి దిగారు. కరప మండలం ఉప్పలంక గ్రామంలో, తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టపోయిన 840 మంది మత్స్యకార కుటుంబాలకు గురువారం అత్యవసర నిత్యావసర సరుకులను పంపిణీ చేసి, తమ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఎంతగా కట్టుబడి ఉందో చాటిచెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, ప్రతి బాధిత కుటుంబానికి 50 కేజీల రైస్ బ్యాగ్, కిలో కందిపప్పు, లీటర్ పామ్ ఆయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళా దుంపలు, కిలో పంచదారతో కూడిన భారీ కిట్‌ను ఎమ్మెల్యే పంతం నానాజీ తన చేతుల మీదుగా అందించారు. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఈ సకాల సహాయంపై స్థానిక ప్రజలు, మత్స్యకార కుటుంబాలు హర్షం వ్యక్తం చేశారు. ?ఈ సహాయక కార్యక్రమం ప్రభుత్వ చిత్తశుద్ధికి, ప్రజా ప్రతినిధుల బాధ్యతాయుతమైన వైఖరికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్ కూటమి నాయకులు రంభాల వెంకటేశ్వరరావు, పితాని లీలా, శిరంగు శ్రీనివాస్, ముద్రగడ్డ రమేష్, బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, సంగాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ...







**జంబుపట్నం గ్రామంలో అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా ఏర్పాటు..**

**నాగ శేషగిరి, అడపా సురేష్ ఆధ్వర్యంలో స్వాములకు భిక్షా,వోడి..**

**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 30:**

కోరుకొండ మండలం జంబుపట్నం గ్రామంలో అత్యంత వైభవంగా అయ్యప్ప స్వామి వారి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాడ్రేవు శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకములు హెూమాలతో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ పడిపూజ కార్యక్రమానికి వేల మంది అయ్యప్ప స్వామి మాల వేసుకున్న స్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగ శేషగిరి, అడపా సురేష్ 18వ పడిపూజ కార్యక్రమం కావున అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ పడిపూజ చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు, జనసేన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ పూజ దగ్గరుండి నిర్వహించిన వడ్రేవు శ్రీను గురుస్వామికి వెండి కంకణం శేషగిరి సురేష్ ఇద్దరు కలిసి గురుస్వామికి బహుకరించారు.

## రెండు రోజుల్లో నివేధికలివ్వమనడం - రైతులకు అన్యాయం



**సీతానగరం, పెన్ పవర్, అక్టోబర్ 30:**రైతులను కౌలు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని రాజానగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వైయస్సార్సీపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సీతానగరం మండలంలోచిన కొండెపూడిరఘుదేవపురం గ్రామ పంచాయతీల రెవెన్యూ పరిధిలో నేల వాలిన పూర్తిగా నీట మునిగిన వరి పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించి రైతులతో జరిగిన పంట నష్టం అడిగి తెలుసుకున్నారు. రైతులు లకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గత నాలుగైదు రోజుల్లో చేతికొచ్చే పంట మొంథా తుఫాన్ నీటి పాలుచేసిందన్నారు. తుఫాన్ వల్ల నష్టపోయిన పంటలను నమోదు రెండు రోజుల్లో పూర్తి చేసి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అది ఎలా సాధ్యమవుతుందని. అన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో రైతులకు ఇన్సూరెన్స్ పూర్తిగా ప్రభుత్వమే చెల్లించేదని రైతులను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా 40 కోట్ల రూపాయల ఇరిగేషన్ పనులను మంజూరు చేయించి టెండర్లు పిలిచే ప్రక్రియ వరకు తీసుకొస్తే దానిని ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి గాలికి వదిలేయడం వల్ల ఎక్కువ మంది రైతులు తుఫాన్ వల్ల నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికి అందిన పంట నాశనం మవ్వడం చాలా బాధాకరమని విచారాన్ని వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రైతులకు తీవ్ర నష్టాలొవచ్చాయన్నారు. ముందస్తు చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. సమగ్రమైన సమాచారాన్ని సేకరించి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారాన్నందించాలన్నారు. చంద్రబాబు రైతులకు ఇన్పుట్ సబ్సిడీ అందజేయడంలో విఫలం చెందారన్నారు. పెట్టిన పెట్టుబడి ఇతర ఖర్చుల వివరాలను రాజా తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచులు కాంద్రపు ముత్యాలు, సత్యం రాంపండు, యువజన విభాగం చేకూరినాని, డాక్టర్ బాబు, పిచ్చుకుల విజయ్, సురేష్ రాజు, గంటా శీను, రైతులు పాల్గొన్నారు ,

## యోగాలో ఉత్తమ ప్రతిభతో జిల్లా స్థాయికి ఎంపిక.




**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 30:**మండల కేంద్రంలోని డా.బొబ్బా జయశ్రీ జడ్పీ గర్ల్స్ హైస్కూల్ లో 10 వ తరగతి చదువుతున్న పసుపులేటి లక్ష్మి శ్రీవిద్య గురువారం కొత్తపేట డివిజన్ స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీలలో యోగాలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి గేమ్స్ కి ఎంపికైంది. దీంతో విద్యార్థిని లక్ష్మీ శ్రీవిద్యను మరింత ఉన్నత విద్య ఉత్తమ ప్రదర్శనతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ హైస్కూల్ హెచ్ఎం కె.ఉమ, ఫిజికల్ డైరెక్టర్లు ఎన్.ప్రసన్న కుమారి,జి.రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయ బృందం,విద్యా కమిటీ,అభివృద్ధి కమిటీ, తదితరులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# తుఫాను బాధితులకు సహాయహస్తం

### ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు
### చేబ్రోలులో 13 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ
### ప్రాణ-ఆస్థి నష్టాన్ని ముందస్తు చర్యలతో నివారించగలిగాం- ఎమ్మెల్యే

**ఉంగుటూరు, పెన్ పవర్ అక్టోబర్ 30:** ఉంగుటూరు నియోజకవర్గం చేబ్రోలులో తుఫాను ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం పంపించిన బియ్యం, నిత్యావసర సరుకులను గురువారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అందజేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచి రాంథే లక్ష్మీ సునీత అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు సమయానికి స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవడంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నిలువరించగలిగాం" అని అన్నారు. తుఫానుతో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉందని, ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

మొత్తం 13 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.



కార్యక్రమంలో ఇంచార్జ్ తహసిల్దార్ వై. పూర్ణచంద్ర ప్రసాద్, ఎంపీడీవో జి. రాజ్ మనోజ్, నారాయణపురం సొసైటీ చైర్మన్ కడియాల రవిశంకర్, టిడిపి మండల అధ్యక్షుడు సుధీర్, జనసేన మండల అధ్యక్షుడు పి. రాంబాబు, హౌసింగ్ ఏఈ సతీష్, జనసేన నాయకుడు సూరత్తుల అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఏలేరు కు వరద, అదుపులో ఉంది. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ షాన్ మోహన్.
- ఏలేరు ప్రాజెక్ట్ దిగువ ప్రాంతాలకు 7000 క్యూసెక్కుల వరద జలాల విడుదల.







**ఏలేశ్వరం, పెన్ పవర్,అక్టోబర్ 30:** ఏలేరు జలాశయం ఎగువన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో ఒక్కసారిగా గురువారం మధ్యాహ్నానికి వరద ఉధృతి 38064 క్యూసెక్కులకు చేరుకుంది. దీంతో ధవళేశ్వరం సర్కిల్ ఇరిగేషన్ ఎస్ ఈ కె. గోపీనాథ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,ఏలేరు ప్రాజెక్ట్ చైర్మన్ బస్వా వీరబాబు జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఏలేరు ప్రాజెక్ట్ కి హుటా హుటిన తరలి వచ్చి, వరద పరిస్థితిని సమీక్షించారు. గత నాలుగు రోజుల నుండి మొంథా తుఫాన్ కారణంగా ఏలేరు జలాశయానికి ఆవలి ఉన్న ప్రాంతాలలో సరిగ్గా వర్షపాతం నమోదు కాకపోవడంతో ఏలేరు జలాశయానికి వరద ముప్పు తప్పిందని అనుకునే లోగానే బుధవారం అడ్డతీగల మండలంలో 10 సెంటీమీటర్లు, రాజవొమ్మంగి మండలం లో 7 సెంటీమీటర్లు భారీ వర్షపాతం నమోదు కావడం తో జలాశయములోకి వరద ప్రవాహం వచ్చింది. దీంతో ఎస్.ఈ. ఏలేరు ప్రాజెక్టుకు ముందుగానే చేరుకుని, జిల్లా కలెక్టర్ ని సంప్రదించి 5 వేల క్యూసెక్కుల నుండి 7వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విచ్చేసిన కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఏలేరు వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేయడంతో ప్రత్తిపాడు, కిర్లంపూడి ,జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు, యు. కొత్తపల్లి మండలాలలోని పల్లపు ప్రాంతాలలో ఏలేరు వరద నీరు ప్రవేశించే ప్రమాదం ఉన్నందున ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఏలేరు జలాశయం పరివాహక ప్రాంతాలలో వరద ఉధృతి నిబట్టి 7 వేల క్యూసెక్కులు పైబడి పెంచడం లేదా మరింత తగ్గించడం జరుగుతుందన్నారు. ఏది ఏమైనా ఆయా మండలాల ప్రజలు, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, ఏలేశ్వరం తాసిల్దార్ కె. కుసరాజు ఎంపీడీవో సిహెచ్. రవి వర్మ, వీఆర్వో అవసరాల కిషోర్,కూటమి నాయకులు జ్యోతుల పెదబాబు, బొదిరెడ్డి గోపాలకృష్ణ,మూది నారాయణ స్వామి,యాళ్ల జగదీష్,వెలుగుల నాని,నూకతాటి ఈశ్వరుడు, వైభోగుల సుబ్బారావు, మనిహంస పవర్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రసాద్ ,ఏలేరు ప్రాజెక్ట్ అధికారులు ఉన్నారు.

## సర్పంచ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత అవార్డు గ్రహీతకు సన్మానం



**ఆలమూరు, పెన్ పవర్,అక్టోబర్ 30:** ఇటీవల జిల్లాస్థాయి స్వచ్ఛత అవార్డు స్వీకరించిన ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన 184 కోడ్ నెంబర్ గల అంగన్వాడి కేంద్రం టీచర్ గెద్దాడ ఆదిలక్ష్మిని, హెల్పర్ పద్మావతిని సర్పంచ్ కట్టా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ నుంచి అవార్డు స్వీకరించిన సందర్భంగా గురువారం వారిని సాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సేవలందించి అవార్డు స్వీకరించడం ఆనందకరమని,తోటి ఉద్యోగస్తులకు ఆదర్శంగా నిలుస్తూ ఇటువంటి అవార్డులు మరెన్నో సాధించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభాష్, కట్టా సత్య ప్రసాద్, సచివాలయం సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే గేట్ల వద్ద తీరనున్న ట్రాఫిక్ కష్టాలు.

### -రైల్వే ఆర్వోబీల కోసం రైల్వే శాఖ భూసేకరణనోటిఫికేషన్
### -చొరవ చూపిన ఎంపి మహేష్ కుమార్ కుమార్



**ఏలూరు అక్టోబర్ 30 పెన్ పవర్:** జిల్లాలో రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చరవచూపడంతో ?కైకరం, దెందులూరు ఆర్వోబీలకు భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. త్వరలోనే మరికొన్ని నోటిఫికేషన్లు విడుదల అయ్యే అవకాశం ఉందని ఎం.పి.కార్యాలయం తెలిపింది.ఏలూరు పార్లమెంట్ పరిధిలో పలు రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్రంతో మాట్లాడి ఇటీవల 13 ఆర్వోబీలు మంజూరు చేయించిన సంగతి తెలిసిందే. తాజాగా ?ఉంగుటూరు మండలం కైకరం, దెందులూరు మండలం కొత్తగూడెంలలో ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి)ల నిర్మాణం కోసం భూసేకరణకు రైల్వే శాఖ ప్రిలిమినరీ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.కైకరం ఎల్సీ నెంబర్ 364 వద్ద 19 సర్వే నెంబర్లలో 6.875 ఎకరాలు, కొత్తగూడెం ఎల్సీ నెంబర్ 355 వద్ద 18 సర్వే నెంబర్లలో 5.314 ఎకరాల భూమి సేకరణ కోసం ప్రకటన జారీ అయింది. ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత భూయజమానులు 30 రోజుల్లో తెలియజేయాలని రైల్వే శాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఆర్వోబీల కోసం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రైల్వే అధికారులను, కేంద్ర రైల్వే మంత్రిని కలిసి అనుమతులు సాధించడమే కాకుండా, భూ సమస్యలు ఉన్న చోట రైల్వే, నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ అధికారులను తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించడంతో ఆర్వోబీల నిర్మాణానికి ముందడుగు పడింది. జిల్లాలో ఎంతో కాలంగా రైల్వే గేట్ ల వద్ద ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతూ వంతెనల నిర్మాణ కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఊరట కలుగ నుంది.

# భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు - కోర్టు తీర్పు

**టీ.నరసాపురం ఘటనలో న్యాయం సాధించిన ఏలూరు జిల్లా న్యాయస్థానం**

**టీ నర్సాపురం, పెన్ పవర్, అక్టోబర్ 30:** ఏలూరు జిల్లా 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జ్ యు.ఇందిరా ప్రియా దర్శిని టీ.నరసాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో చోటుచేసుకున్న భార్య హత్య కేసులో నిందితుడు కోడూరి.మణికంఠ స్వామి (29 ఏళ్లు)కు జీవిత ఖైదు శిక్షను విధించారు.ఈ కేసు ( సి ఆర్.నెం.183/2019, యు/ఎస్ 498(ఏ), 302 ఐపిసి ) లో ముద్దాయి మద్యపానానికి, ఇతర వ్యసనాలకు బానిసై భార్య కోడూరి జీవన జ్యోతి (27 ఏళ్లు)ను నిరంతరంఅనుమానిస్తూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. 2019 జూలై 17వ తేదీ రాత్రి వాగ్వాదం సమయంలో అల్యూమినియం టెలిఫోన్ క్రాస్ రాడ్‌తో భార్య తలపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.కోర్టు విచారణలో నిందితుడుభార్యనువేధించినందుకు (498ఏ) మూడుసంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా, హత్య చేసినందుకు (302 ఐపీసీ) జీవిత ఖైదు మరియు రూ.1000 జరిమానా విధించారు.ఈ కేసును అప్పటి చింతలపూడి ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్ సమర్థంగా దర్యాప్తు చేసి, చార్జ్ షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. విచారణలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చింతమనేని.రమేష్ వాదనలుసమర్థంగావినిపించారు.కేసు విచారణలో పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం. సుబ్బారావు, జీలుగుమిల్లి ఇన్‌స్పెక్టర్ బి. వెంకటేశ్వరరావు, టీ. నరసాపురం ఎస్ఐ ఎం. జయబాబు, హెడ్ కానిస్టేబుల్స్ ఎం. జయరాజు (1635), ఎం.నాగేశ్వరరావు (394), ఎం. శ్రీనివాస్ (1838)లు సాక్షులను సమయానికి హాజరుపరిచి కేసు విజయవంతంగా పూర్తయ్యేలా కీలక పాత్ర పోషించారు.ఈ కేసులో న్యాయం సాధించడంలో ప్రతిభ కనబరిచిన అధికారులను ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్, ప్రత్యేకంగా అభినందించారు.కోర్టుమానిటరింగ్ సెల్ ఏర్పాటుతో కేసుల వేగవంతమైన విచారణ జరగడమే కాకుండా, న్యాయం త్వరితగతిన సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

## సుడిగాలి ప్రభావంతో నేలకొరిగిన భారీ వృక్షాలు.



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 30:** మండలంలోని చొప్పెల్ల శివారున ఉన్న నివాసాలపై చిన్న సుడిగాలి ప్రవాహం గురువారం ఉదయం విరుచుకు పడింది. దీంతో భారీ వృక్షాలు, పలు నివాసాల పైకప్పులు పేక మెడల్లా కూలాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎంపిడిఓ ఎ.రాజు, స్థానిక సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య, కార్యదర్శి పి.వెంకటలక్ష్మి, విఆర్ఓ సూర్య ప్రకాష్ తదితరులు ఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులను ధైర్యం చెప్పారు.సాధారణంగా ఈ చిన్న సుడిగాలి నదులలో ప్రారంభమై భూమి మీదకు వచ్చేటప్పుడు అది వేగంగా కదులుతూ ఆ దిశలో ఉన్న వాటిని అతలాకుతలం చేస్తుంది. ఈ క్రమంలో పలువురికి చెందిన ఆర్‌సిసి బిల్డింగ్ వరండాల్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్లు, ఎసి యూనిట్లు, ఫ్రిజ్లు, తాత్కాలిక నివాసాలకు చెందిన ఐరన్ రేకులు దెబ్బతిని అందులో ఉన్న ఫర్నీచర్‌లకు నష్టాలు వాటిల్లాయి. వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాలు కావడంతో ఆయా బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అదే ప్రాంతంలో ఉన్న ఎస్‌సి కాలనీ, ఎంపిపి పాఠశాలలో చెట్లు పశువుల పాకలు, ఇటుక బట్టీలకు చెందిన షెడ్లు దెబ్బతిన్నాయి. ఇక్కడ ఇంకా వలస కూలీలు రాకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ సంఘటన ఎదుర్కొన్న వారంతా ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదని బాధితులంతా పేర్కొన్నారు. ప్రభుత్వంమమ్మల్ని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల విజయం లక్ష్యంగా ఆర్.జే.డీ. నాగమణి ఆదేశాలు: కరప పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ



**కరప, పెన్ పవర్, అక్టోబర్ 30:** పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, విద్యార్థుల ప్రగతిని పరిశీలించేందుకు రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి. నాగమణి గురువారం మండల కేంద్రం కరప జడ్పీ హై స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఆర్జేడీ నేరుగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారికి సిలబస్ పూర్తయిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే, విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ఎంతవరకు సిద్ధంగా ఉన్నారో అంచనా వేశారు. ఆ తరువాత, ఉపాధ్యాయులతో ఒక సమావేశం నిర్వహించి, రాబోయే వంద రోజులలో ప్రతి విద్యార్థి తప్పకుండా ఉత్తీర్ణత సాధించే విధంగా ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. అనంతరం ఆర్జేడీ కరప మెయిన్ ఎంపీపీ స్కూల్‌ను సందర్శించారు. అక్కడ విద్యార్థుల పని పుస్తకాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించే లక్ష్యంతో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, దాని నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాల విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా, విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేయాలని ఆర్జేడీ నాగమణి ఉపాధ్యాయ బృందానికి సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కొప్పుల బుల్లి కృష్ణవేణి, పీ. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com